జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php




సంపుటి 15 సంచిక 243 విశాఖపట్నం | బుధవారం 03 మే 2023 | 8 పేజీలు | వెల : 5.00

## ఎపిలో కమలం కొత్త రూటు...

# పొత్తులకు సై అంటున్న అధిష్టానం..



అమరావతి, : ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేనల్తో కలసి ఎన్నికల పొత్తు పెట్టుకునే పరిస్థితులు బిజెపిలో స్పష్టమౌతున్నాయి. ఇంతవరకు ఈ రాష్ట్రంలో ప్రధాన పార్టీలైన వైకాపా, తెలుగుదేశం, జనసేన మూడూ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా కేంద్రంలోని బిజెపికి అనుకూలంగానే వ్యవహరిస్తున్నాయి. రాష్ట్రంలోని 25మంది లోక్‌సభ సభ్యులు కూడా బి జెపి ప్రభుత్వానికి మద్దతుగానే ఉన్నారు. ఇక్కడ ఏ పార్టీ అధికారంలోకొచ్చినా కేంద్ర స్థాయికొచ్చేసరికి తమ అదుపాజ్ఞల్లోనే ఉంటారన్న విశ్వాసం ఇంతవరకు బిజెపి అధిష్టానంలో ఉంది. కానీ ఇప్పుడు మోడి, అమిత్‌షాలు అంతటి తో సంతృప్తి చెందే పరిస్థితు ల్లేవు. ఎపిలో కూడా బిజెపిని ఓ ప్రబల శక్తిగా రూపుదిద్దాలన్న ఆకాంక్ష వారిద్దరిలో వ్యక్తమౌతోంది. ఇక్కడ సొంతంగానే పునాదులేసుకోవాలన్న అభిలాష బిజెపిలో దీర్ఘకాలంగా నెలకొంది. ఇది కార్యరూపం దాల్చాలంటే ముందుగా రాష్ట్రంలో కొన్నైనా లోక్‌సభ, శాసనసభ సీట్లను బిజెపి సాధించు కోవాలి. ఇందుకు తెలుగుదేశం, జనసేనలతో పొత్తు ఒక్కటే మార్గం. 2024 ఎన్నికల్లో కూడా జాతీయ స్థాయిలో బిజెపి తిరిగి ఘనవిజయం సాధించే పరిస్థితులున్నాయి. కాగా ప్రస్తుత కేంద్ర కేబినెట్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఏ ఒక్కరికీ ప్రాతినిధ్యం లేదు. పక్కనున్న తెలంగాణాకు చెందిన కేంద్రమంత్రులే ఎపి వ్యవహారాలు కూడా జాతీయ స్థాయిలో చక్కబెట్టాల్సొంది. ఈ రాష్ట్రం నుంచి కేంద్ర క్యాబినెట్ లోకి తీసుకునేందుకూడా అనుగుణమైన వ్యక్తులెవరూ బిజెపికి అందు బాటులో లేరు. దీంతో రాష్ట్రంలో బిజెపి భవిష్యత్‌లో కూడా ఇదే తరహాలో నామమాత్రంగా మిగిలిపోయే ప్రమాదాన్ని అధిష్టానం గుర్తించింది. (మిగతా 2లో..)

## నేడు భోగాపురం ఎయిర్‌పోర్టుకు...

# జగన్ శంకుస్థాపన

### సభ ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి బొత్స



భోగాపురం (విజయనగరం) : విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించ తలపెట్టిన అంతర్జాతీయ విమానాశ్రయానికి సిఎం జగన్ రేపు శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా శంకుస్థాపన జరిగే ప్రదేశాన్ని, సభ ఏర్పాట్లు , పార్కింగ్, జనాభా తరలింపు, కాన్వాయ్ ట్రయల్ రన్ సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చడం పట్ల ఉత్తరాంధ్ర ప్రజలు ఆనందంగా వున్నట్లు పేర్కొన్నారు. రూ.4,500 కోట్లతో భోగాపురం ఎయిర్ పోర్టుకు శంకుస్థాపన చేయడంతో సహా, రూ.194 కోట్లతో తారకరామ తీర్థసాగరం పెండింగ్ పనులకు, మత్స్యకార చిరకాల వాంఛ అయిన ఫిషింగ్ జెట్టీ పూసపాటిరేగ మండలం చింతపల్లిలో నిర్మాణానికి రూ.23.74 కోట్లతో సిఎం శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు. సీఎం కార్యక్రమం సమన్వయకర్త తలశిల రఘురాం, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపికా పటేల్, జిల్లా జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిఎంఆర్ అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో డిఐజి హరికృష్ణ, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్ బాబు, పులి రాజు, వివిధ శాఖల అధికారులు, మండల పార్టీ కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

# మహాత్మాగాంధీ మనవడు కన్నుమూత



ముంబయి : మహాత్మాగాంధీ మనవడు అరుణ్‌గాంధీ (89) మంగళవారం కన్నుమూశారు. ఆయన గతకొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మంగళవారం మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో మరణించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న అరుణ్‌గాంధీ కొల్హాపూర్‌కి వచ్చారు. అక్కడే పదిరోజులపాటు బస చేయాలనుకున్నారు. కానీ అక్కడి నుంచి తాను బయలుదేరేముందు అనారోగ్యానికి గురికావడంతో.. కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయినప్పటి నుంచి ప్రయాణాలు చేయవద్దని వైద్యులు సూచించడంతో అరుణ్‌గాంధీ కొల్హాపూర్‌లోనే ఉండిపోయారు. ఆయన ఈరోజు ఉదయం తుదిశ్వాస విడిచినట్లు అరుణ్‌గాంధీ కుమారుడు తుషార్ గాంధీ ట్విటర్ వేదికగా తెలియజేశారు. కాగా, మహాత్మాగాంధీ కుమారుడు మణిలాల్ గాంధీ, సుశీ మష్రువాలా దంపతులకు అరుణ్‌గాంధీ ఏప్రిల్ 14, 1934న దర్బన్‌లో జన్మించారు. అరుణ్‌గాంధీ సామాజిక కార్యకర్తగా, రచయితగా తన తాత అడుగుజాడల్లోనే నడిచినట్లు ఆయన కుమారుడు తుషార్ గాంధీ ట్విట్టర్ ద్వారా తెలిపారు. ఇక అరుణ్‌గాంధీ అంత్యక్రియలు మంగళవారం సాయంత్రం కొల్హాపూర్ జిల్లాలోని వాషి నంద్వాల్‌లో నిర్వహించనున్నట్లుగా ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.



## ఎన్‌సిపి పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకున్న శరద్‌పవార్

ముంబై : నేషనలిస్ట్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు శరద్‌పవార్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఆయన ఎన్‌సిపి పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకోనున్నట్లు మంగళవారం ఉదయం ప్రకటించారు. అయితే, శరద్‌పవార్ ఎన్‌సిపి పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకున్న తర్వాత.. ఆ బాధ్యతల్ని ఎవరు తీసుకోనున్నారనే వివరాలను ఆయన స్పష్టం చేయలేదు.

## 2024 ఎన్నికల్లో బీజేపీకి భంగపాటు తప్పదు : మమతా బెనర్జీ



కోల్‌కతా : 2024 సార్వత్రిక ఎన్నికల్లో మార్పు ఖాయమని పశ్చిమ బెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ( అన్నారు. గత పదేండ్లుగా బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు.కేంద్రంలో కాషాయ సర్కార్ చరిత్రను మార్చడం, ఎన్ఆర్‌సీ పేరుతో అన్యాయం చేయడం మినహా మోదీ సర్కార్ ప్రజల కోసం పాటుపడిందేమీ లేదని దీదీ దుయ్యబట్టారు. ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చి బీజేపీ సర్కార్‌ను నిలువరించాలని కోరారు.రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ మట్టికరుస్తుందని అన్నారు. విపక్షాలు ఏకమైతే బీజేపీ ఓటమిపాలవుతుందని, విభజిత శక్తులపై భారత్ విజయం సాధిస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మతాల మధ్య చిచ్చు రేపుతున్న బీజేపీ కుయుక్తులను ఎండగడుతూ ప్రజలంతా ఏకం కావాలని దీదీ పిలుపు ఇచ్చారు.


## బంగ్లా టు భారత్.. రూ.13 కోట్ల విలువైన పాము విషం అక్రమ రవాణా

బంగ్లాదేశ్ నుంచి భారత్ కు అక్రమంగా తరలిస్తున్న పాము విషాన్ని బీఎస్ఎఫ్ దళాలు స్వాధీనం చేసుకున్నాయి. బంగ్లా సరిహద్దుల గుండా ఇద్దరు స్మగ్లర్లు భారత్‌లోకి అక్రమంగా ప్రవేశిస్తున్నారని బీఎస్ఎఫ్ దళాలకు సమాచారం అందింది. దీంతో వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది దక్షిణ దినాజ్‌పూర్ జిల్లాలోని హిలి ప్రాంతం వద్ద పహన్‌పరా గ్రామంలో కాపు కాశారు.ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 12:30 గంటల ప్రాంతంలో ఇద్దరు స్మగ్లర్లు దేశంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. గమనించిన భద్రతా దళాలు కాల్పులు జరపడంతో వారు అక్కడి నుంచి తప్పించుకుని పారిపోయారు. ఆ సమయంలో స్మగ్లర్లు వారి వద్ద ఉన్న ఓ సీసాను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. దానిని భద్రతా సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఆ సీసాలో పాము విషం ఉండటాన్ని గుర్తించిన బీఎస్ఎఫ్ సిబ్బంది అధికారులకు సమాచారం ఇచ్చారు.సీసాపై 'మేడ్ ఇన్ ఫ్రాన్స్' అని కూడా రాసి ఉందని.. బాటిల్‌లో ఉన్న విషం కోబ్రా పాముదని అధికారులు తెలిపారు.

# కాషాయ సర్కార్ అవినీతిపై నోరు మెదపని మోదీ : రాహుల్ గాంధీ



బెంగళూర్ : కర్నాటక అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ తేదీ సమీపిస్తుండటంతో ప్రధాన పార్టీలు ప్రచారాన్నిహోరెత్తిస్తున్నాయి. ర్యాలీలు, రోడ్‌షోలు, భారీ బహిరంగ సభలతో ఎన్నికల ప్రచారం క్లైమాక్స్‌కు చేరింది. తీర్థహళ్లిలో మంగళవారం జరిగిన ర్యాలీలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు.ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ మూడేండ్ల కిందట దొడ్డిదారిన బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని దుయ్యబట్టారు. కాషాయ సర్కార్ అధికారాన్ని బలవంతంగా గుంజుకుందని ఆరోపించారు. బీజేపీ సర్కార్ అవినీతిపై ప్రధాని మోదీ ఎందుకు మాట్లాడటం లేదని రాహుల్ నిలదీశారు. కర్నాటకలో కాషాయ సర్కార్ అవినీతికి అడ్డుకట్ట వేసేందుకు ఏం చర్యలు తీసుకున్నారో మోదీ వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రధాని మోదీ ఇక్కడకు వచ్చి కాంగ్రెస్ తనపై 91 సార్లు దాడి చేసిందని చెబుతున్నారు తప్ప కర్నాటక గురించి ఏమీ మాట్లాడటం లేదని అన్నారు. బీజేపీ ప్రభుత్వం ఏం చేస్తుందో మోదీ చెప్పాలని అన్నారు. ప్రధాని మోదీ ప్రచారంలో తన గురించే మాట్లాడుతున్నారు తప్ప బీజేపీలో ఇతర నాయకుల గురించి, యువత, మహిళల గురించి అసలు ప్రస్తావించడం లేదని మండిపడ్డారు. ఇక మే 10న కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.



## మున్సిపల్ కమిషనర్ జయరాం ఆకస్మిక తనిఖీ




నందిగామప్రజాపాలన ప్రతినిధి: నగర పంచాయత్ పరిధిలోని 10 వ సచివాలయమును ది.02-05-2023 వ తేదీన మంగళవారం రోజున మున్సిపల్ కమిషనర్ జయరాం ఆకస్మిక తనిఖీ చేయుట జరిగినది. సదరు తనిఖీ నందు రికార్డ్స్ సక్రమముగా ఉంచవలసినదిగా, సకాలములో పెన్షన్ అమౌంట్ పంచగా మిగిలిన మొత్తమును మరియు సచివాలయము నందు సర్వీసెస్ కొరకు కట్టిన చలాన అమౌంట్ ను బ్యాంకు నందు జమచేయవలసినదిగా తెలియజేసియున్నారు. అంతేకాకుండా సచివాలయ సర్వీస్ లపై అక్కడి ప్రజలకు అవగాహన కల్పించవలసినదిగా సచివాలయ సిబ్బందిని మరియు వాలంటీర్లు ను ఆదేశించారు. ఈ కార్యక్రమములో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మల్లాది బాలాత్రిపుర సుందరమ్మభౌతికకాయానికి నివాళులర్పించిన మంత్రి అంబటి రాంబాబు



ఎన్టీఆర్ జిల్లా ప్రజాపాలన ప్రతినిధి: విజయవాడ సెంట్రల్ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాతృమూర్తి మల్లాది బాలాత్రిపుర సుందరమ్మ భౌతికకాయానికి నివాళి అర్పించి,కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రివర్యులు అంబటి రాంబాబు. మరియు నగర ప్రముఖులు వైఎస్ఆర్సిపి నేతలు.

## జొన్నవాడ కుంభాభిషేకం మహెూత్సవం ఆరోరోజు



బుచ్చి ప్రజాపాలన ప్రతినిధి: బుచ్చి మండలం జోన్నవాడ గ్రామంలో స్వయంభూ గా అవతరించిన శ్రీ మల్లికార్జున స్వామి సమేత కామాక్షి తాయి అమ్మవారి కుంభాభిషేకం మహెూత్సవం ఆరోరోజు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులు కొలాన్ రాజారెడ్డి దంపతులు ఆలయ పాలకమండలి సభ్యులు చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రహ్మణ్యం నాయుడు దంపతులు యాగశాల వేదిక పూజ - జపం హెూమం మూడవ కాల పూజ - పూర్ణాహుతి -జప హెూమం - తత్వ హెూమం - యాగశాల పూజ - నాల్గవ కాల పూజ లఘు పూర్ణాహుతి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు విజయేంద్ర సరస్వతి స్వామి స్వహస్తాలతో ఋత్విక్కులు భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించడం జరిగింది

## జర్నలిస్టుల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు..



పిఠాపురం, ప్రజాపాలన ప్రతినిధి: పిఠాపురం నియోజకవర్గ జర్నలిస్టుల ఆధ్వర్యంలో పిఠాపురం పట్టణంలోని స్థానిక సాయిబాబా గుడి సెంటర్లో మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రం లో జర్నలిస్టులు బాటసారులకు,పట్టణ ప్రజలకు చల్లటి మజ్జిగ అందచేశారు. ప్రజా సమస్యలను వెలికి తీయడమే కాకుండా, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పాత్రికేయులను ప్రజలు అభినందించారు. వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కాగా గత మూడు సంవత్సరాలుగా వేసవి కాలంలో జర్నలిస్టులు చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణలో డిఎస్పీ శ్రీకాంత్ సహకారం మరువలేనిది: జిల్లా ఎస్పీ

**బదిలీపై వెళుతున్న చీరాల డిఎస్పి శ్రీకాంత్ ను ఘనంగా సన్మానించిన ఎస్పీ, జిల్లా పోలీసు అధికారులు**

చీరాల, మే 02, ప్రజాపాలన : శాంతిభద్రతల పరిరక్షణలో చీరాల డిఎస్పీ అందించిన సహకారం మరువలేనిదని,




జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఇటీవల జరిగిన డిఎస్పీ ల బదిలీలలో, చీరాల ఎస్.డి.పి.ఓ పి.శ్రీకాంత్ గుడివాడకు బదిలీపై వెళుతున్నందున, జిల్లా పోలీస్క్యాంప్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో, జిల్లా పోలీస్ అధికారులు, డిఎస్పీ.శ్రీకాంత్ కు వీడ్కోలు అభినందన సభ నిర్వహిం చారు. ముఖ్య అతిధి గా పాల్గొన్న, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ,1991 వ బ్యాచ్ కు చెందిన శ్రీకాంత్ సివిల్ ఎస్.ఐ.గా, పోలీస్ శాఖలోకి ప్రవేశించి, అంచెలంచె లుగా ఎదిగి, చీరాల డిఎస్పీ గా బాధ్యతలు చేపట్టి విధి నిర్వ హణలో, ఎంతో అంకిత భావం తో పని చేశా రన్నారు. నూతనం గా ఏర్పడిన బాపట్ల జిల్లాలో పోలీస్ శాఖ బలోపేతం కావడంలో, డీఎస్పీ శ్రీకాంత్ అందించిన సహకారం అభినందనీయ మన్నారు. చీరాల సబ్ డివిజన్ పరిధిలో, శాంతిభద్రతల పరిరక్షణలో విశేషంగా కృషి చేశారన్నారు. ఓర్పు, సహనంతో ఆలోచించి, త్వరిత గతిన నిర్ణయాలను తీసుకొంటూ, ఎటువంటి సమస్యలు తలెత్తకుండా, సమయస్ఫూర్తితో వ్యవహ రించే వారని కొనియాడారు. జిల్లాలో నాటు సారా కట్టడిలో, రోడ్డు ప్రమాదాలను తగ్గించు టలో, నేరాల నియంత్రణలో విశేషంగా కృషిచేశారన్నారు. బదిలీపై వెళుతున్న డిఎస్పీ శ్రీకాంత్, వృత్తిజీవితంలో మరిన్ని పదోన్నతులు పొందాలని, ఆ భగవంతుని ఆశీస్సులు,ఎల్లవేళలా తోడుగా ఉండాలని, కొత్త పోస్టింగ్ నందు తమ సమ ర్థతతో, ఆ పోస్ట్ కు, మరింత వన్నె తేవాలని ఎస్పీ ఆకాంక్షించారు. అనుభవమున్న డి.ఎస్.పి శ్రీకాంత్, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో విశేష కృషి చేశారని, అడిష నల్ ఎస్పీ పి.మహేష్ కొనియా డారు. బదిలీపై వెళుతున్న కొత్త ప్రదేశంలో కూడా, సమర్థవంతం గా విధులు నిర్వహించి, ఉన్నత మైన స్థాయికి చేరుకోవాలని ఆశించారు. అనంతరం డిఎస్పీ శ్రీకాంత్ ను, జిల్లా ఎస్పీ గజమాలతో ఘనంగా సన్మానించా రు. శాంతి భద్రతలకు విఘాతం కలిగినప్పుడు, వారి అనుభవా న్ని, నైపుణ్యతను ఉపయోగిం చి సమస్యలను పరిష్కరించి, శాంతి భద్రతలను పరిరక్షించిన తీరు, కొన్ని సమస్యాత్మక కేసులను సానుకూలంగా పరిష్కరించిన విధానాన్ని ఈ సందర్భంగా చీరాల డిఎస్పీ. శ్రీకాంత్ గుర్తుచే సుకున్నారు. ఉన్నతాధికారులు తమకు ఇచ్చిన బాధ్యతలను, ఆదేశాలను సబ్ డివిజన్ పోలీసు అధికారులు, సిబ్బంది సమిష్టి సహకారంతో, విజయవంతంగా పూర్తి చేయగలిగానన్నారు. అనంతరం జిల్లాలో అనుభవాలను, కొన్ని సంఘటనలలో శాంతి భద్రతల పరిరక్షణకు, చేసిన కృషిని ఈ సందర్భంగా జిల్లా పోలీసు అధికారులతో పంచుకున్నారు. కార్యక్రమంలో బాపట్ల అడిషనల్ ఎస్పీ పి.మహేష్, రేపల్లె డి.ఎస్.పి టి.మురళీకృష్ణ, ఏఆర్ డి.ఎస్.పి ఏమ్.డి.హెచ్ ప్రేమ్‌కుమార్, ఎస్.బి ఇన్స్పెక్టర్ ఏ.శ్రీనివాస్, జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## చీరాల నియోజకవర్గ అభివృద్ధి యే లక్ష్యంగా కృషి చేస్తున్నా: చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి



చీరాల, మే 02, ప్రజాపాలన : చీరాల నియోజకవర్గ అభివృద్ధి యే లక్ష్యంగా కృషి చేస్తున్నాన ని, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణ మూర్తి స్పష్టం చేశారు. బాపట్ల కలెక్టర్ ఆఫీస్ లో జరిగిన, బాపట్ల జిల్లా డి ఆర్ సి మీటింగ్ లో, చీరాల శాసన సభ్యులు కరణం బలరామ కృష్ణ మూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చీరాల నియోజకవర్గ అభివృద్ధి కి సంబంధించిన పలు అంశాలను ప్రస్తావి స్తూ, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు,జిల్లా మంత్రులు, జిల్లా అధికారులు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమం లో మంత్రులు,ఎమ్మెల్యేలు,శాసనమండలి సభ్యులు, తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన విబిఎస్ తరగతులు



చీరాల, మే 02, ప్రజాపాలన : చిన్న పిల్లలను ఆటంకపరచక, వారిని నా యొద్దకు రానియ్యుడి, పరలోక రాజ్యము ఇలాంటి వారిదే, అన్న క్రీస్తు మాటలను అనుసరిస్తూ,సెయింట్ మార్క్బ లూథరన్ బ్రాంచ్ చర్చ్ పేరాల నందు, మంగళవారం విబిఎస్ (ఓకేషన్ బైబిల్ స్కూల్) విరామ బైబిల్ పాఠశాల తరగతులను, సండే స్కూల్ సూపరింటెండెంట్ చుక్కా బ్యూలా లారెన్స్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ముందుగా ప్యారిస్ పాస్టర్ జోసఫ్ కేరి ప్రార్థనతో ప్రారంభించారు. అనంతరం విరామ బైబిల్ పాఠశాల తరగతులకు, హాజరై న చిన్నారులకు శుభాశీస్సులు అందజేశారు. అసోసియేట్ పాస్టర్ పిల్లి దేవదాసు చిన్నారులను ఉ ద్దేశించి మాట్లాడారు. బాలుడు నడవవలసిన త్రోవలో వారికి నేర్పుము, వాడు పెద్దవాడైనప్పుడు దాని నుండి తొలగిపోడు అని, చెప్పిన బైబిల్ మాటలను గుర్తు చేస్తూ, చిన్ననాటి నుండి పిల్ల లు దేవుని యందు, భయభక్తు లు కలిగి, పెద్దలపట్ల గౌరవ మర్యాదలతో మెలిగినప్పుడు, వారు జీవితంలో ఉన్నత స్థాయికి వెళతారని, ఈ విరామ బైబిల్ పాఠశాలకు హాజరైన చిన్నారులు, అందరూ కూడా జీవితంలో ఉన్నత స్థితికి ఎదగాలని, ఆశీస్సులు తెలియజేశారు. విబి ఎస్. డైరెక్టర్ వేముల డానియల్ ఐజక్ సన్ మాట్లాడుతూ, వేసవి సెలవులలో చిన్నారులు ఆడుతూ పాడుతూ, విబిఎస్ తరగతులను పూర్తిచే యడాని కి, ఇక్కడ అన్ని అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సండే స్కూల్ సూపరింటెండెంట్ చుక్కా బ్యూలా లారెన్స్ మాట్లాడుతూ, ఈ విరా మ బైబిల్ పాఠశాల నందు అంశమైన, “ఒకరికి ఒకరు ఒకరు సేవ చేసుకోవడం” అనేది, చిన్ననాటి నుండే పిల్లలు అలవర్చుకుంటే, జీవితం లో ఎన్ని కష్టనష్టాలు వచ్చినా, ఒడిదుడుకులు ఎదురైనా, నిబ్బరంగా నిలబడి, దేవుని వైపు చూసే శక్తి ఉంటుందని అన్నారు. ఈ 12 రోజుల లో పప్పెట్ షో, బైబుల్ నీతి కథలు, ఆటపాటలతో, ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సెయింట్ మార్క్బ లూథరన్ బ్రాంచ్ చర్చి పేరాల సండే స్కూల్ వైస్ సూపరింటెండెంట్ మంకెన హేమలత, ఎన్.భాగ్య రాణి, సెక్రటరీ కారుమంచి బ్లెస్సీ పాల్ చంద్, సెక్రటరీ యోపూరి అరుణప్రియ, కడియం జయశ్రీ, ట్రెజరర్ పేర్లి రిచర్డ్స్, జాయింట్ ట్రెజరర్ సల గల వినోద్, పేర్లి రత్న, సండే స్కూల్ చిన్నారు లు, పి.సి.సి.,ఎల్.సీ.సీ. సభ్యు లు పాల్గొన్నారు.

# పొత్తులకు సై అంటున్న అధిష్టానం..

(మొదటి పేజీ తరువాయి)

ఈ పరిస్థితి నుంచి రాష్ట్ర బిజెపిని తప్పించేందుకు నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పటికే రాష్ట్ర పార్టీకి అధిష్టానం నుంచి సంకేతాలు కూడా అందాయి. గత సార్వత్రిక ఎన్నికల్లో ఎపిలో బిజెపి ఒంటరిగానే పోటీ చేసింది. కానీ ఎన్నికల అనంతరం జనసేనతో ఆ పార్టీకి పొత్తు కుదిరింది. అయితే ఇది కేవలం నామమాత్రపు సయోధ్యగానే కొనసాగుతోంది. రానున్న ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోకూడదన్న ప్రతిపాదనను జనసేనాని తెరపైకి తెచ్చారు. ఇందుకోసం టిడిపితో పొత్తుకు ఆయన సిద్దపడుతున్నారు. అయితే గతంలో చంద్రబాబుతో ఉన్న విబేధాల్ని దృష్టిలో పెట్టుకుని ఎపి బిజెపి ఈ కలయిక పట్ల వ్యతిరేకత కనబరుస్తోంది. పదే పదే కేంద్ర నాయకత్వానికి కూడా ఇదే విషయాన్ని నివేదిస్తోంది. వెళ్తే జనసేనతో లేదా జనంతో మాత్రమే తమ పొత్తు అంటూ ఎపి బిజెపి నాయకులు పదే పదే ప్రకటనలిస్తున్నారు. ఇంతవరకు వీరి సూచనలకు ఆమోదం తెలిపిన అధిష్టానం ఇప్పుడు రూటు మార్చింది. ఇందుకు పరిమితమైతే రాష్ట్రంలో బిజెపి విస్తరణకు అవకాశాలుండవని అధిష్టానం ఓ నిర్ణయానికొచ్చేసింది. పొత్తులతోనే పోటీకి సిద్దం కావాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఎపిలో బిజెపి, వైకాపాల మధ్య అనధికార పొత్తు కొనసాగుతోంది. వైకాపాకున్న 22మంది లోక్‌సభ సభ్యులు కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే బిల్లుల ఆమోదానికి అనుకూలంగా ఓట్లేస్తున్నారు. వీరు ఏ రోజూ బిజెపిని ఓ విపక్షపార్టీగా పరిగణించలేదు. బిజెపికి వ్యతిరేకంగా ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. అలాగని రాష్ట్రంలో బహిరంగంగా బిజెపితో పొత్తుపెట్టుకునేందుకు వైకాపా సంసిద్దంగాలేదు. రాష్ట్రంలోని క్రిస్టియన్లు, ముస్లింల మద్దతు ఎక్కువగా వైకాపాకుంది. బిజెపితో జతకడితే వీరి మద్దతు కోల్పోవాల్సొస్తుందన్న భయం జగన్‌లో నెలకొంది. దీంతో తెరచాటు వ్యవహారంగా తప్ప బిజెపితో నేరుగా పొత్తు పెట్టుకుని బరిలో దిగేందుకు వైకాపా సాహసించడంలేదు. ఈ దశలో చంద్రబాబు, పవన్‌ల మధ్య ఇప్పటికే దాదాపుగా ఖ రారైన కూటమిలో చేరేందుకు బిజెపి అధిష్టానం కూడా సిద్దంగా ఉన్నట్లు రాజధాని వర్గా భోగట్టా. తద్వారా 2024ఎన్నికల్లో కనీసం పది లోక్‌సభ, 25శాసనసభ సీట్లకు పోటీ చేసి రాష్ట్రంలో పునాదులేర్పాటు చేసుకోవాలన్నది బిజెపి అధిష్టానం లక్ష్యంగా తెలుస్తోంది. అలాగే చంద్రబాబుతో కలవడానికి ససేమీరా కుదరదంటూ ప్రకటనలిస్తున్న రాష్ట్ర నాయకత్వానికి కూడా ఇప్పటికే అధిష్టానం నుంచి హెచ్చరికలు జారీ అయ్యాయి. రాష్ట్ర నాయకత్వాన్ని నమ్ముకుంటే ఇక ఎపిలో తమ పార్టీకి ఏమాత్రం ఎదుగుదల ఉండదన్న నిర్ణయాన్ని పార్టీ అధిష్టానం వీరికి తేటతెల్లం చేసేసింది. బిజెపి ఏ కులానికో లేదా కుటుంబానికో చెందిన ప్రాంతీయ పార్టీ కాదు. జాతీయ దృక్పధంతో వ్యవహరించే పార్టీ. జాతీయ స్థాయిలోనే పొత్తులు, ఇతర అంశాలపై నిర్ణయాలుంటాయి. స్థానిక అంశాల్ని అధిష్టానం ఏమాత్రం పరిగణనలోకి తీసుకోదు. అలాగే గత నాలుగేళ్ళుగా రాష్ట్రంలో పార్టీని ఉద్దరిస్తామన్న నాయకులెవరూ ఆ దిశగా చేస్తున్న ప్రయత్నాల్లో ఒక్క శాతం కూడా సఫలం కాలేకపోయారు. ఇప్పటికీ రాష్ట్రంలో ఆ పార్టీ ఓటు బ్యాంక్ 0.84 శాతానికి మాత్రమే పరిమితమైంది. పక్కనున్న తెలంగాణా తరహాలో ఇతర పార్టీల్లోని బలమైన నాయకుల్ని ఆకర్షిం చడంలో ఎపి నాయకత్వం ఘోరంగా వైఫల్యం చెందింది. వాళ్ళొద్దు.. వీళ్ళొద్దు.. అంటూ అధిష్టానం చెవిలో ఊదరగొట్టడం తప్ప తమకు తాముగా బలమైన నాయకుల్ని తెచ్చి పార్టీలో చేర్చే ప్రయత్నాల్ని ఎపి నాయకత్వం ఏనాడూ చేపట్టలేక పోయింది. పైగా ఉన్న పదిమంది లోనూ వర్గాలు, కుమ్ములాటల్తో పార్టీ మరింతగా కుంచించుకుపోయింది. ఈ దశలో పార్టీని ఇతర రాష్ట్రాల్తో సమానంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా విస్తరించేందుకు అందుబాటులో ఉన్న తెలుగుదేశం, జనసేనల్తో పొత్తే సహేతుకమన్న నిర్ణయానికి అధిష్టానం వచ్చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ పొత్తు పొడిస్తే రాష్ట్రంలో బిజెపి కూడా ఓ బలమైన పార్టీగా రూపుదిద్దుకోవడం తధ్యమన్న విశ్వాసం పార్టీ సీనియర్లలో ఇప్పటికే స్పష్టమౌతోంది.

## అన్ అకాడమీ ద్వారా శిక్షణ పొంది జేఈఈ అడ్వాన్స్ డ్ కు అర్హత సాధించిన 14వేల మంది విద్యార్థులు

విజయవాడ,ప్రజాపాలన ప్రతినిధి మే 2023 - భారతదేశంలో అత్యంత కఠినమైన పరీక్షలు అనగానే మనకు గుర్తుకువచ్చేవి జేఈఈ, నీట్. ఇలాంటి పరీక్షలన కూడా చాలా ఎదుర్కుంటూ అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నారు కొంతమంది విద్యార్థులు. దానికి కారణం... భారతదేశంలో అగ్రగామి సంస్థగా పేరు తెచ్చుకున్న అన్ అకాడమీ. భారతదేశంలో చాలా వేగంగా విస్తరిస్తున్న ఆన్ లైన్ లెర్నింగ్ ప్లాట్ ఫామ్ అనగానే అందరికి గుర్తుకువచ్చేది అన్ అకాడమీ. జేఈఈ, నీట్ పరీక్షలకు సిద్ధమయ్యే ఎంతోమంది విద్యార్థుల ఆకాంక్షలను తీర్చిన ఆన్ అకాడమీ... తాజాగా ప్రకటించి జేఈఈ అర్హత పరీక్షల్లోనూ సత్తా చాటింది. అన్ అకాడమీలో ఆన్ లైన్ ద్వారా శిక్షణ పాఠాలు నేర్చుకున్న దాదాపు 1000 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్, 2003 పరీక్షల్లో టాప్ ర్యాంకులు సాధించారు. తద్వారా అడ్వాన్స్ డ్ పరీక్షకు అర్హత సాధించారు. ఇక అన్ అకాడమీ ద్వారా పాఠాలు నేర్చుకుని టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఒక్కసారి చూస్తే... ఇషాన్ ఖండేవాల్, (ఆల్ ఇండియా ర్యాంకు 11), దేషాంక్ ప్రతాప్ సింగ్ (ఆలిండియా ర్యాంకు 12), నిపున్ గోయల్ (ఆలిండియా ర్యాంకు 13) ఉన్నారు. పీయూష్ మహేశ్వరి, బ్రిజేష్ జిందాల్, మహ్మద్ కాషీఫ్ ఆలం లాంటి అగ్రశ్రేణి విద్యావేత్తలు ఇక్కడ ఆన్ లైన్ లో పాఠాలు బోధిస్తారు. వీరి పాఠాలు విన్న విద్యార్థులు తమ విద్యా ప్రయాణంలో రాణించగలుగుతున్నారు. ఇంకా, భారతదేశంలోని వివిధ నగరాల్లో ఇటీవలే అనాకాడెమీ సెంటర్ లు ప్రారంభం ఆయ్యాయి.

## సంక్షేమ హాస్టల్ లు వెంటనే పున ప్రారంభించాలి



కర్నూలు ప్రజాపాలన ప్రతినిధి : ఎత్తేసినటువంటి సంక్షేమ హాస్టల్ లు వెంటనే పున ప్రారంభించాలని రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో వినతి ఎమ్మిగనూరు నియోజకవర్గం పరిధిలో యువగలం పాదయాత్ర సందర్భంగ నారా లోకేష్ కి రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా పోతులపాడు నాగరాజు గజేంద్ర నాయుడు లోకేష్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో ఎత్తేసినటువంటి సంక్షేమాష్టలను వెంటనే పున ప్రారంభించి విద్యార్థి భవిష్యత్తులను కాపాడాలని కర్నూలు జిల్లాలో ఎక్కువగా వలస ప్రాంతాలు కాబట్టి ఎమ్మిగనూరు నియోజకవర్గంలో సీజనల్ హాస్టల్ ను ఏర్పాటు చేయాలని అదేవిధంగా హాస్టల్ కు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో మాధవ్ రాజు తదితరులు పాల్గొన్నారు

## మల్లాది బాలాత్రిపుర సుందరమ్మ గారి భౌతికకాయానికి ప్రముఖుల నివాళులు



విజయవాడ ప్రజా పాలన ప్రతినిధి : రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాతృమూర్తి బాలాత్రిపుర సుందరమ్మ గారి భౌతికకాయానికి మంగళవారం పలువురు ప్రముఖులు అంజలి ఘటించారు. లబ్బీపేటలోని ఎమ్మెల్యే నివాసానికి పార్టీలకు అతీతంగా పలువురు ప్రముఖులు విచ్చేసి నివాళులు అర్పించారు. మల్లాది విష్ణు కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, మంత్రి అంబటి రాంబాబు, ఏపీ కమ్యూనికేషన్స్ సలహాదారు, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జీవీడీ కృష్ణమోహన్, ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, సెక్రటరీ తిలక్, డిఎం %డ% హెచ్ఓ సుహాసిని, ఏఎంహెచ్ఓ రామకోటేశ్వరరావు, నాయకులు జోగి మోహన్ రావు, జోగి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు. కాగా అంత్యక్రియలు బుధవారం భవానీపురంలోని పున్నమిఘాట్ నందు జరగనున్నాయి. ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే స్వగృహం నుంచి అంతిమయాత్ర ప్రారంభం అవుతుందని ఆయన కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

## రాష్ట్ర ప్రతిష్ట ను దిగజార్చిన వైకాపా ప్రభుత్వం.... మీ భవిష్యత్ మా బాధ్యత: జ్యోతుల నెహ్రూ



గోకవరం ప్రజా పాలన మే 2: గోకవరం మండలం కొత్తపల్లి గ్రామంలో మీ భవిష్యత్తు మా బాధ్యత ఇంటింటికి జ్యోతుల నెహ్రూ ఏడవ రోజు రాష్ట్ర తెదేపా ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ కరపత్రాలు పంపిణీ చేస్తూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్థాయిలో రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చారని ప్రభుత్వం వైకాపా అని నెహ్రూ అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సూన్యం అని, గ్రామాల కలయక తోనే భారత దేశం ఏర్పడిందని, గ్రామ పంచాయితీ లకు రాజ్యాంగ పరంగా నిధులు ఇవ్వాల్సిన బాధ్యత రాష్ట్రానికి, కేంద్ర ప్రభుత్వానికి ఉందని అందులో భాగంగా మన రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధులను పక్కకు మళ్లించి గ్రామీణ అభివృద్ధి ని నిర్వీర్యం చేసిందన్నారు. గత తెదేపా ప్రభుత్వ సమయంలో పంచాయితీ రాజ్ వ్యవస్థలో అనేక అవార్డులను గెవడం జరిగిందని అటువంటిది ఈ ప్రభుత్వం లో ఒక్క అవార్డ్ ను గెలవలేక పోవటం రాష్ట్రానికి అవమానం అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి 13 అవార్డులు వచ్చినవని. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరచి మీ పరిపాలన పరిస్థితి ఏంటో తెలుసుకోవలని నెహ్రూ అన్నారు. రాష్ట్రంలో దళితులకు భద్రత లేకుండా పోయిందని ఈ ప్రభుత్వానికి రాజ్యాంగం పట్ల గౌరవం లేదు, రాజ్యాంగ వ్యవస్థ ల పట్ల అవగాహన లేదని అన్నారు. మళ్లీ గ్రామ స్వరాజ్యం రావాలంటే తెదేపా మద్దతు ఇచ్చి రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా నన్ను గెలిపించండి ముఖ్యమంత్రిగా చంద్రబాబుని గెలిపించండి అని జ్యోతుల నెహ్రూ కోరారు. ఈ కార్యక్రమంలో మండలం తెదేపా నాయకులు కొత్తపల్లి గ్రామ తెదేపా నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా మే డే వేడుకలు..



పీలేరు, ప్రజాపాలన ప్రతినిధి: గాయపడిన కార్మికులకూ ఆర్థిక సహాయం తో పాటు నిత్య అవసర సరుకులు బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎ. బలరాం ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు ప్రభాకర్ రాజు, రసూల్, ఎన్టీఆర్ నఫీస్,రమణయ్య, మహబూబ్ బాషా,మురళి,ద్వారక, ఈశ్వరా, అమరానాధ్, జ్యోతి, మునిరత్నా, వెంకటరమణ, శ్రీలక్ష్మి, వెంకటేష్, మహబూబ్ జాన్,కృష్ణయ్య,నాగయ్య, వెంకటరమణ, రాజామ్మ, గురుమూర్తి,బాబు, లక్ష్మయ్య, చిన్నప, సిద్దిక్, చిన్న ఎర్రయ్య, శ్రీధర్, హరి, నాగరాజు, సుబ్రహ్మణ్యం, మనోజ్, భూపతి, కమల్ బాషా,హాసన్, జయరాం, బోదేశ్, షూకుర్, ముని రాజా, సిద్దయ్య, నాగయ్య, ప్రసాద్,రాజేంద్ర, భాస్కర్, మోహన్, చంద్రమౌళి ఆచారి సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా బాధ్యతలు తీసుకున్న బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్ భాష, జాయింట్ కలెక్టర్ శ్రీధర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన బిసి సంఘ రాష్ట్ర అధ్యక్షులు కేశన



బాపట్ల జిల్లా ప్రజా పాలన మే 2 కలసిన జిల్లా అభ్యున్నతి మీ అనుభవంతో శరవేగం చేయాలని జిల్లా కలెక్టర్ రంజిత్ భాషకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు విజ్ఞప్తి చేశారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న కలెక్టర్ రంజిత్ భాష, జాయింట్ కలెక్టర్ శ్రీధర్ ను మర్యాదపూర్వకంగా మంగళవారం ఆయన, జిల్లా అధ్యక్షుడు జువ్వా శివ రాంప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, యువజన రాష్ట్ర ఉపాధ్యక్షుడు ద్వారక శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, గౌరవ అధ్యక్షులు తాతయ్య మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ బీసీలకు అందాల్సిన సంక్షేమ పథకాలను అందించడంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. తాను ఈ జిల్లాలోని నిజాంపట్నం మండలం బుర్రావారిపాలెం వాసినని తమ జిల్లా అభ్యున్నతికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్, జేసీలను కోరారు. జిల్లాలోని బీసీల గ్రామాలు, ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గం అధ్యక్షులు పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, యువజన అధ్యక్షుడు ఎన్ఎస్పి రాజు, న్యాయ సలహాదారుడు నటరాజన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కాపుల పై ఉన్న తుని రైల్వే ఘటన కేసు కొట్టేయడం హర్షించదగ్గ విషయం యువ పారిశ్రామిక వేత్త కృష్ణచైతన్య



బాపట్ల జిల్లా ప్రజా పాలన మే 2: కాపుల పై తుని రైలు దగ్ధం కేసు ను రైల్వే కోర్ట్ కొట్టి వేయడం హర్షించదగ్గ విషయమని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చొరవ తోనే ఈ కేసు కొట్టివేయడం జరిగిందన్నారు. బి జె పి యువమోర్చా బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు ప్రముఖ యువ పారిశ్రామిక వేత్త కృష్ణ చైతన్య మీడియా ప్రతినిధుల సమావేశంలో తెలియచేయడం జరిగింది .

## వరి మొక్కజొన్న పంటలలో కోత వర్షాలు వలన గింజలు మొలక రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు


గోకవరం ప్రజా పాలన మే 2: కోతకు ముందు వర్షాలు వస్తే వరి వెన్నుల మీద ఐదు శాతం ఉప్పు నీరు (లీటరు నీటికి 50 (గ్రా. ఉప్పును) కలిపి పిచికారి చేయాలని, పైరు పనల మీద తడిస్తే ఉప్పు ద్రావణంలో ( లీటరు 50 (గ్రా. ఉప్పు) కంకులను ముంచి ఆరబెట్టి చిన్న చిన్న కుప్పులుగా వేయాలన్నారు. ఎకరానికి 10 – 15 కిలోల ఉప్పు అవసరము. ఇలాచేస్తే 10 –15 రోజుల వరకు గింజలు పాడవ్వవు. 4. ఉప్పు ద్రావణం వాడకం వీలుకాని పక్షంలో తడిచిన పనలను ఆరనిచ్చి కుప్పులగా వేస్తే ఉప్పు పొడిని కంకుల మీద చల్లాలన్నారు. నూర్చిన తర్వాత వరిధాన్యం తడిస్తే క్వింటాలు వడ్లకు ఒక కిలో ఉప్పు, 4 కిలోల ఊక లేదా ఎండుగడ్డి (చిన్న చిన్న ముక్కలగా) చేసి కలిపి కుప్పగా పోసి వారం రోజుల తర్వాత ఆరబెట్టాలన్నారు. మొక్కజొన్న కోత దశలో ఉన్న మొక్కజొన్న పైరు వర్షాలు ఎక్కువ ఐతే వర్షాలు తగ్గాకే కోత చేపట్టాలని, చేను నేలకు ఒరిగితే పోలములో నీటిని పిల్ల కాలువులు ద్వారా బయటికి పంపించి చేను పైన ప్రోపికోనజోల్ 1 మి. లీ. లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. మొక్కజొన్న కోత తర్వాత కళ్లము పైన ఆరబెట్టిన మొక్కజొన్న కండెలు తడిస్తే వీలైనంత వరకు నీటిలో తడవకుండా చూడాలని, తడి కండెలును కుప్పగా పోయకూడదు అన్నారు. తడి కండెలు పైన టార్పీను కప్ప కూడదని, గాలి బాగా తగిలేలా ఇంట్లో ఆరబెట్టాలన్నారు. అవసరాన్ని బట్టి కండెలు పైన 5 % మెత్తటి ఉప్పును తడిచిన కండెలు పైన పలచగా జల్లి కిందామీద బాగా కలపడము వలన మొలక రాకుండా కొంత వరకు నివారించ వచ్చు అన్నారు. వ

## ఎస్సీ ఎస్టీ రైతులు పంట పొలాల్లో దిగుబడి వచ్చే పంటలను వేసుకోవాలి

పల్నాడు జిల్లా. సత్తెనపల్లి .మే 2 (ప్రజాపాలన ప్రతినిధి) ఎస్సీ, ఎస్టీ రైతులు భూసార పరీక్షలు చేయించుకుని తమ పొలాల్లో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలను వేసుకోవాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు, పల్నాడు జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం సత్తెనపల్లి మండలం బట్లూరు గ్రామంలో దళిత బహుజన రిసోర్సెస్ సెంటర్ ఆధ్వర్యంలో గ్రామ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో చిన్నప్ప మాట్లాడుతూ ప్రస్తుతం పిల్లి పెసర, జీలుగు, జనము 50 శాతం సబ్సిడీ ద్వారా రైతు భరోసా కేంద్రాల నుండి ఇవ్వటం జరుగుతుందని ఈ అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీ రైతులు సద్వినియోగం చేసుకోవాలని, అదేవిధంగా గ్రామంలో ఉన్నటువంటి రైతులందరూ భూసార పరీక్షలు చేయించుకొని భూమిలో ఉన్న సారాన్ని బట్టి పంటలు వేయాలని, గ్రామాల్లో భూ యజమానుల దగ్గర నుండి భూమిని కౌలుకి తీసుకున్న రైతులు భూ యజమానులతో మాట్లాడి వారి ద్వారా అనుమతి పత్రంపై సంతకాలు చేయించుకొని క్రాఫ్ కల్టివేషన్ రైట్ కార్డులు తీసుకొని రైతు భరోసా 13,500 రూపాయలు, ఇన్పుట్ సబ్సిడీపై రుణాలు పొందాలని ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని ఈక్రాప్ నమోదు ద్వారా పండించిన పంటలను మార్కెట్లో గిట్టుబాటు ధరలకు అమ్ముకోవడానికి అవకాశం ఉంటుందని, మీరందరూ కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని అనుకూలమైన పంటలు వేసి అధిక దిగుబడులు సాధించి అభివృద్ధి చెందాలని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ రైతులు పాల్గొన్నారు.

## కిడ్నీ మార్పిడిపై జరుగుతున్న ప్రచారంలో నిజం లేదు..

### అధికారిక కమిటీ ఆమోదంతోనే కిడ్నీ మార్పిడి చికిత్స ప్రఖ్యాత నెఫ్రాలజిస్ట్ డాక్టర్ నలమాటి అమ్మన్న



విజయవాడ, ప్రజా పాలన ప్రతినిధి: ఓ కిడ్నీ మార్పిడి చికిత్సకు సంబంధించి తమ హాస్పిటల్ పై జరుగుతున్న ప్రచారంలో ఎంత మాత్రం నిజం లేదని అరుణ్ కిడ్నీ సెంటర్ అధినేత, ప్రఖ్యాత నెఫ్రాలజిస్టు డాక్టర్ నలమాటి అమ్మన్న తెలిపారు. సూర్యారావుపేటలోని అరుణ్ కిడ్నీ సెంటర్ లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారిక కమిటీ ఆమోదం తర్వాతే కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించామని అన్నారు. కిడ్నీ గ్రహీత వెంకటేశ్వరరావు, దాత శ్రీనివాసరావులిద్దరూ అమలాపురానికి చెందినవారనీ. వాళ్లిద్దరూ బావ బావమరుదులని చెప్పినప్పటికీ అవయవ మార్పిడికి సంబంధించి అధికారిక కమిటీ సమీక్షకు పంపించామని తెలిపారు. దాత, గ్రహీతల మధ్య ఎటువంటి ఆర్థిక లావాదేవీలు జరగలేదని కమిటీ సభ్యులు విశ్వసించడంతోనే కిడ్నీ మార్పిడికి ఆమోదం లభించిందని, పూర్తి చట్టబద్ధంగానే సదరు కిడ్నీ మార్పిడి చికిత్సను నిర్వహించామని వెల్లడించారు. కిడ్నీ మార్పిడి విషయంలో తాము నిబంధనలను కచ్చితంగా పాటించామని, సదరు వ్యవహారంలో వాస్తవాలను ప్రతిఒక్కరికీ తెలియజేసేందుకే ఈ సమావేశం ఏర్పటుచేశామని డాక్టర్ అమ్మన్న పునరుద్ఘాటించారు.

## సీసీ డ్రైయిన్ పునర్నిర్మాణం చేపడతాం: కమిషనర్

పొన్నూరు:(ప్రజా పాలన ప్రతినిధి) :పొన్నూరు పురపాలక సంఘ పరిధిలోని 26వ వార్డులో నూతనంగా సీసీ డ్రైయిన్ నిర్మాణం జరుగుతున్నది. గత 30వ తేదీన నిర్మాణం జరుగుతున్న స్థలం ప్రక్కన ఉన్న గోడ కూలి నిర్మిస్తున్న సైడ్ వాల్ పై పడటంతో కూలిపోయింది. అకాల వర్షం



కారణంగా పడిపోయిన సిసి డ్రైయిన్ ను అదే కాంట్రాక్టర్ తో పునర్నిర్మాణం చేయుచున్నామని పొన్నూరు పురపాలక సంఘం కమిషనర్ డాక్టర్ ఎన్. రాధా తెలిపారు. అంతేకాకుండా కాంక్రీట్ యొక్క క్యూట్ లను కూడా ఏడు రోజులకు మరియు 28 రోజులకు కూడా పరీక్షించుట జరుగునని ఒక ప్రకటనలో తెలిపారు.




జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

## సంపాదకీయం

బుధవారం 03, మే 2023

# తిరోగమనంలో మోదీ పాలన

మనది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. ప్రజాస్వామ్యానికి ప్రతిపక్షమే కీలకం. కానీ ప్రతిపక్షాలు లేకుండా ఏకపక్షపాలన చేయాలనుకుంటున్నది కేంద్రంలోని మోదీ ప్రభుత్వం. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, అవినీతికి తావులేని పాలన అందిస్తామని నమ్మబలికి తొమ్మిదేండ్ల కింద అధికారంలోకి వచ్చిన బీజేపీ గద్దెనెక్కాక ఆది పూర్తిగా విస్మరించింది. పేదలను కొట్టి పెద్దలకు పెట్టే చర్యలను అమలు చేస్తున్నది. ప్రజల చేత, ప్రజల కోసం ఎన్నుకోబడిన ప్రభుత్వం పెట్టుబడిదారుల కోసం, తమ అనుయాయుల కోసం మాత్రమే పాలన సాగిస్తున్నది. కాంగ్రెస్ పార్టీ మీద ఉన్న వ్యతిరేకత అనుకూలించి అధికారంలోకి వచ్చింది బీజేపీ. కానీ నేడు మోదీ పాలనంతా బడా పెట్టుబడిదారులకు ఊడిగం చేసే విధంగానే ఉన్నది. తొమ్మిదేండ్ల పాలనలో తొంభై ఏండ్లు వెనక్కు వెళ్లిన పరిస్థితి కనిపిస్తున్నది. ఓవైపు కరెన్సీ విలువ పడిపోతున్నది. ద్రవ్యోల్బణం పెరిగిపోతున్నది. ఆర్థిక సంక్షోభం అలుముకుంటున్నది. జీడీపీ తలకిందులవుతున్నది. వస్తు ఉత్పత్తి తగ్గిపోతున్నది. కేంద్ర ప్రభుత్వం వీటన్నిటిని పక్కన పెట్టి వాస్తవాలను తెలియనీయకుండా మభ్యపెట్టే ప్రయత్నాలను కొనసాగిస్తున్నది. ఉపాధికి కోతలు పడుతున్నాయి. పరిశ్రమలు మూతపడుతున్నాయి. నిరుద్యోగం పెరిగిపోతున్నది. కార్పొరేట్ల సంపద మాత్రం లక్షల కోట్లకు పెరిగిపోతున్నది. మోదీని ప్రజలు ఎన్నుకున్నది తమ బతుకులను బా గు చేస్తాడని? ఒక్కసారి కాదు రెండుసార్లు గద్దెనెక్కించి ఇప్పుడు కడగండ్ల పాలవుతున్నారు. మిశ్రమ ఆర్థిక వ్యవస్థ కోసం ఆనాడు పంచవర్ష ప్రణాళికలలో భాగంగా ప్రభుత్వ రంగాన్ని ప్రజా సంక్షేమానికి, దేశ ప్రగతికోసం ఏర్పాటు చేసింది నెహ్రూ ప్రభుత్వం. దేశ ప్రజలకు అవసరమైన బిలాయి, విశాఖ లాంటి ఉక్కు కర్మాగారాలను, మందుల సంస్థలను, ఎల్ఐసీ లాంటి ప్రజాప్రయోజన వ్యవస్థలను, ఈసీఐఎల్ లాంటి సాంకేతిక పరిశ్రమలను, షిప్పింగ్ కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. కానీ మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత క్రమక్రమంగా నష్టాల పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను మూసివేసే ప్రక్రియ ప్రారంభించింది. నిర్లజ్జగా, నిస్సిగ్గుగా, కారుచౌకగా అమ్మకాలకు తలుపులు తెరిచింది. తన సంపన్న మిత్రులకు దోచిపెడుతున్నది. గత ఏడేండ్లుగా నిరాటంకంగా బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ, స్టీల్ లాంటి లాభాల్లో ఉన్న ప్రభుత్వ సంస్థలను అంబానీ, అదానీ లాంటి పారిశ్రామిక దిగ్గజాలకు కారుచౌకగా కట్టబెడుతున్నది. అందులో భాగంగానే ఎన్నో త్యాగాలతో సంపాదించుకున్నవైజాగ్ స్టీల్ ప్లాంట్ అమ్మకానికి తెరలేపింది. కార్మిక చట్టాల సవరణ పేరుతో నాలుగు కోడ్లుగా విభజించి పరిశ్రమల యజమాన్యాలకు మేలు చేకూర్చింది. పోరాడి సాధించుకున్న 8 గంటల పనిదినాన్ని 12 గంటలకు మార్చింది. పేద, మధ్య తరగతి వర్గాలపై అధిక భారాలు మోపుతూ పెద్దలకు మాత్రం రాయితీల మీద రాయితీలు కల్పిస్తూ వారికి అంతులేని లాభాలను కట్టబెడుతోంది మోదీ ప్రభుత్వం. మోదీ ప్రధాని అయ్యాక ప్రపంచ కుబేరుల్లో భారత్ నుంచి స్థానం సంపాదించుకున్నవాడు అదానీ. అంటే దీనికి కారణం మోదీ అందదండలే. తాజాగా అదానీ కంపెనీకి చెందిన ఎన్ఎమ్ఎల్ సంస్థకు రూ.12,770 కోట్ల రుణాన్ని ఎస్‌బీఐ మాఫీ చేసింది. 2021 జులైలో అదానీ ఏయిర్ పోర్ట్ హోల్డింగ్ లిమిటెడ్ ద్వారా ముంబై అం తర్జాతీయ విమానాశ్రయం లిమిటెడ్‌ను సొంతం చేసుకున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. అదానీ డొల్ల వ్యాపారాలు బహిర్గతమైన కూడా పార్లమెంట్‌లో మోదీ నిర్లజ్జగా వెనుకేసుకు రావడం వెనుక వాస్తవా లు ఏమిటో దేశ ప్రజలకు తెలియాలి? పార్లమెంట్ లో చర్చ జరగకుండా, ఆదానీ గుట్టు బయటపడకుం డా మోదీ ప్రభుత్వం కాపాడింది. అధికారంలోకి వస్తే నల్లధనం వెలికితీసి ప్రతి పౌ రుడికి రూ.15 లక్షలు బ్యాంకు ఖాతాలో జమ చేస్తామన్నారు. కనీసం రూ.15 కూడా సామాన్యుని ఖా తాలో జమ కాలేదు. కానీ అదానీ లాంటి బడాబాబుల ఆస్తులు మాత్రం లక్షల కోట్లకు ఎగబాకాయి. ఇదేకాదు బీజేపీ పాలిత రాష్ట్రమైన గుజరాత్‌లో ప్రభుత్వ పెద్దలు రూ.లక్ష కోట్ల స్కాముకు పాల్పడ్డారనిని కాగ్ నివేదిక వెల్లడించింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో రాష్ట్ర ప్రభుత్వం గుర్తు తెలియని సంస్థలకు, ఏజెన్సీలకు ఏకంగా వేల కోట్లను చెల్లించింది. మరోవైపు, కేంద్రం విపక్ష పాలిత రాష్ట్రాలకు ఆర్థిక పరమైన చెల్లింపులలో మోకాలడ్డుతున్నది. అందులో తెలంగాణ రాష్ట్రం కూడా ఒకటి. భిన్నత్వంలో ఏకత్వంగా సాగుతున్న ప్రజల్ని కులం పేర, మతం పేర చీల్చుతున్నది. బీజేపీ అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాల పట్ల గొంతెత్తినా పత్రికల్లో రాసినా, మీడియాలో చూపినా ఆక్రమ అరెస్టులు, కేసులు పెట్టి జైళ్ల పాలు చేస్తున్నది. యూపీలో యోగి సర్కార్.. నేరచరిత్ర పేరిట 233 మందిని ఎన్‌కౌంటర్ చేసింది. 4,484 మందిని జైలు పాలు చేసింది. ఈ దేశ ప్రధానులు ఇందిరాగాంధీ, రాహుల్‌గాంధీల హంతకులతో పాటు, ఉగ్రవాదులు కసబ్, పార్లమెంట్‌పై దాడి చేసిన అఫ్జల్‌గురులను కూడా చట్టప్రకారం శిక్షలు పడే విధంగా చేసినటు వంటి దేశంలో ప్రస్తుతం ఆరాచకం రాజ్యమేలుతున్నది. తమ మాట వినని ప్రతిపక్షాలను, నాయకులపై అక్రమ కేసులు పెట్టి ఈడీ, సీబీఐ సంస్థల ద్వారా లొంగ దీసుకుంటున్నది. గవర్నర్లను రబ్బర్ స్టాంపులుగా ఉపయోగించుకుంటూ ప్రతిపక్ష ప్రభుత్వాలను పడగొట్టే విధానాలను అనుసరిస్తున్నది. ఇటీవల జమ్మూ కశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ మోదీ ప్రభుత్వంపై సంచలన ఆరోపణ చేశారు. పుల్వామా ఘటనకు కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణమని వెల్లడించారు. కేంద్రం అసమర్థత, చేతకానితనం వల్లనే 40 మంది జవాన్లు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు, మైనారిటీలు, మహిళలపై దాడులు దౌర్జన్యాలు పెరుగుతున్నా కేంద్రం మౌనం వహిస్తున్నది. మరోవైపు, తెలంగాణ-ఏపీలకు విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ఇరు రాష్ట్రాల మధ్య కొత్త కొట్లాటలు పెట్టే కుట్రలకు పాల్పడుతున్నది. మోదీ నియంత పాలనను గద్దెదించేందుకు జరుగుతున్న పోరాటంలో ప్రజలందరూ భాగస్వాములవ్వాలి. ప్రజాస్వామ్యాన్ని, లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి.

# పుట్టుక, పెళ్లితోనే కుటుంబాలు ఏర్పడతాయా?



సుప్రీంకోర్టులో 'వివాహ సమానత్వం' కోరుతూ ఇరవై మంది వేసిన పిటిషన్ల గురించి జరుగుతున్న వాదోపవాదనలు పెళ్లి, కుటుంబం, వివాహ హక్కులు, దగ్గరి సంబంధాల గురించి అత్యంత ఆసక్తికరమైన చర్చలని లేవదీస్తున్నాయి. ఈ వ్యాజ్యాలు జెండర్ మైనారిటీ వర్గాల వ్యక్తులు వేసినవి. స్పెషల్ మ్యారేజ్ చట్టంతో సహా వివాహ చట్టాలు సమ లైంగిక సంబంధాల్లోని వ్యక్తులకి, ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకి వ్యతిరేకంగా ఉన్నాయని, ఆ వివక్షని నిర్మూలించాలని వీరు కోరుతున్నారు. వాటిని విచారిస్తూ ఏ చట్టాల్లో ఏ రకంగా మార్పు తేవచ్చునన్న విషయంపై ప్రధాన న్యాయమూర్తి నియమించిన (ఆయనతో సహా) ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ముందు ప్రభుత్వం, పిటిషనర్ల న్యాయవాదులు వాదనలు జరుపుతున్నారు. ఈ వాదనలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఎవరైనా చూడొచ్చు. ఈ 20 వ్యాజ్యాలలో వివిధ రకాలైనవి ఉన్నాయి. కులం, మతం, ప్రాంతం మొదలైన వాటితో సంబంధం లేకుండా ఏ ఇద్దరు వయోజనులైన వ్యక్తులైనా పౌర వివాహం చేసుకోగలిగే అవకాశాన్ని కల్పించే స్పెషల్ మ్యారేజ్ చట్టంలో ఆడ మగ అనే వర్గాలని తీసేసి ఎవరికైనా పెళ్లి చేసుకునే అవకాశం కల్పించాలి అనేవి కొన్ని. మరికొన్ని ఈ వివాహ చట్టం కేవలం వివాహం చేసుకునేందుకు మాత్రమే అవకాశం కల్పిస్తుంది కానీ, కలిసి పిల్లల్ని దత్తత చేసుకునే హక్కు, ఆస్తిని రాసిచ్చే హక్కు, కలిసి ఇల్లు అద్దెకి తీసుకునే లేదా కొనుక్కోగలిగే హక్కు, అకౌంట్లు, ఇన్సూరెన్స్ కలిసి తీసుకునే హక్కు, మెడికల్ సర్జరీలప్పుడు సంతకం చేసే హక్కు, మొదలైన మరే హక్కులనీ కల్పించదు కాబట్టి అన్ని వివాహ చట్టాలలోనూ, అంటే పర్సనల్ చట్టాలలో కూడా జెండర్‌తో సంబంధం లేకుండా పెళ్లిళ్లు చేసుకునే వెసులుబాటు కల్పిస్తూ మార్పులు తేవాలని అని అడిగిన వ్యాజ్యాలు ఉన్నాయి. అసలు స్పెషల్ వివాహ చట్టం ఆచరణలో కులాంతర, మతాంతర వివాహాలని ప్రోత్సహించే బదులు, పెళ్లి చేసుకుంటామని అర్జీ పెట్టుకున్న వారి పేర్లు, ఇతర వివరాలను నెల రోజుల పాటు అభ్యంతరాలని ఆహ్వానించే పేరుతో అన్ని చోట్లా ప్రదర్శనకు పెట్టి వారిపై హింస జరగటానికి వీలు కల్పిస్తోంది కాబట్టి, ఆ నిబంధనను తీసేయాలని దనక్ వంటి సంస్థలు అడుగుతున్నాయి. క్వీర్ యువతకి – గే, లెస్బియన్, ట్రాన్స్, ఇతర గుర్తింపులవారికి – అన్నిటికన్నా పెద్ద ప్రమాదం, తీవ్ర హింస, ప్రాణ హాని స్వంత కుటుంబాల నుండే వస్తోందని క్వీర్ స్త్రీవాద సంస్థలు వాదిస్తున్నాయి. అసలు కుటుంబం అంటే రక్తసంబంధీకులతో లేదా పెళ్లితో వచ్చేదిగా మాత్రమే కాకుండా స్వంతంగా స్నేహితులు, హితులు, ఆత్మీయులతో కలిసి కూడా ఏర్పాటు చేసుకునేదిగా కూడా గుర్తించాలని అర్జీ వేసుకున్నాయి. లవ్ జిహాద్ బూచిని దేశవ్యాప్తంగా పెంచి పోషించిన హిందుత్వ వాదులు, తాము అధికారంలో ఉన్న ఉత్తర్‌ప్రదేశ్‌లోనూ, ఈ మధ్యే మహారాష్ట్రలోనూ కులాంతర మతాంతర వివాహాలపై కఠిన నిబంధనలు పెడుతూ చట్టాలను, విధానాలను రూపొందించారు. అంతేగాక, కులాంతర మతాంతర వివాహాలు చేసుకునే యువతీ యువకులపై హింస దేశంలో అన్ని రాష్ట్రాల్లో గత కొన్నేళ్లుగా విపరీతంగా పెరుగుతోంది. పిల్లలపై జరిగే వేధింపులని ఆపటానికి చేసిన పోక్సో చట్టం, బాల్య వివాహాలని ఆపటానికి చేసిన చట్టాలను కూడా యువతీ యువకుల స్వేచ్ఛను నిర్మూలించటానికే ఎక్కువగా వాడుకుంటున్నారు. మన రాష్ట్రంలో తల్లిదండ్రులు చేసే బాల్య వివాహాలు ఎక్కువే గానీ, అదే వయసులోని అమ్మాయిలు అబ్బాయిలు తమంతట తాము వివాహం చేసుకోదలిస్తే మాత్రం కుటుంబాలు, పోలీసులు, సంక్షేమ యంత్రాంగం తక్షణం ప్రవేశిస్తాయి. ఆయా చట్టాల ఉపయోగం కూడా ఎక్కువగా ఈ కేసుల్లోనే, ముఖ్యంగా కులాంతర మతాంతర సంబంధాల విషయంలో జరుగుతోంది. దేశంలో ఎక్కడా కూడా పెద్దగా ఉపయోగంలోకి రాని బాల్య వివాహ చట్టాన్ని కూడా వంకరగా ఉపయోగించే ప్రయోగం ఈ మధ్య హేమంత బిస్వాస్ ఆధ్వర్యంలోని అస్సాం ప్రభుత్వం విజయవంతంగా జరిపింది. మైనారిటీ తీరకుండా వివాహం చేసుకున్నారనే నెపంతో అనేకమంది ముస్లిం యువకుల్ని అరెస్టు చేసి జైళ్లలో పెట్టింది. ఇప్పటి వరకూ ఇటువంటి జంటలకు ఆర్య సమాజ్ వివాహాలు అనుకూలంగా ఉండేవి. కానీ ఈ మధ్యే ఆర్య సమాజ్‌పై కూడా కొరడా ఝుళిపించి తల్లితండ్రుల అనుమతి లేకుండా ఆయా జంటలకు వివాహాలు జరపమనే నిబంధన తెచ్చేలా చేశారు. కుటుంబం, తల్లిదండ్రుల అధికారాన్ని మరింత బలోపేతం చేసే విధంగా ఆధునిక రాజ్యం, దాని అంగాలు ఎందుకు కదులుతున్నాయనేది ఇప్పటికయినా అందరం వేసుకోవాల్సిన ప్రశ్న. ఇది అమాయకంగా 'తండ్రి ప్రేమ', 'తల్లి ప్రేమ'ల గురించి మాట్లాడుకునే విషయం కాదు. మన దేశంలో రాజ్యం, పెట్టుబడి కలిసి ఎటువంటి మౌలిక హక్కులను కానీ, సాంఘిక సంక్షేమాన్ని గానీ కల్పించకుండా కుటుంబాన్నే అందరు వ్యక్తులకి ప్రధాన ఆర్థిక, సామాజిక వనరుగా కాపాడటంతో 'కుటుంబం' ప్రాధాన్యం తగ్గటానికి బదులు పెరుగుతూ వస్తోంది. ఈ అధికారాన్ని మన దేశ వివాహ చట్టాలు, వాటిని తలకెత్తుకున్న మత సంస్థలు, రాజ్య వ్యవస్థ గట్టిగా కాపాడుతున్నాయి. ఈ నేపథ్యంలో చూసినప్పుడు వివాహ సమానత్వం గురించి ప్రస్తుతం ఉన్నత న్యాయస్థానంలో జరుగుతున్న వాదోపవాదనలు కేవలం సమలైంగికులకి, పర లైంగికులకి మధ్య బేధాల గురించి కాదు. పరలైంగిక వివాహాలన్నీ గురుతర సామాజిక బాధ్యతయిన పిల్లల పెంపకం కోసమే జరుగుతాయని, సమ లైంగిక సంబంధాలు కేవలం లైంగిక తృప్తి కోసమేనని ఎవరైనా అంటే అంతకన్నా హాస్యాస్పదం మరేమీ ఉండదు. వివాహం అంటేనే పరస్పర బాధ్యత, ఆర్థిక సంబంధాలు, పిల్లల పెంపకం, వృద్ధాప్యంలో తోడు మొదలైనవి. ఎవరు చేసుకోవాలనుకున్నా వివాహ సంబంధాల అంతరార్థం అదే. కులాంతర, మతాంతర, సమ లైంగిక, ట్రాన్స్‌జెండర్ వివాహాలు ఏవైనా కావచ్చు, అన్నీ అంతే. తామెంచుకున్న వ్యక్తితో ఉండాలనుకోవటం తప్ప ఏ వివాహంలోనైనా కొత్తది ఏమీ ఉండదు. ప్రభుత్వ తరపు న్యాయవాదులు సమలైంగిక, ట్రాన్స్‌జెండర్ వివాహాల గురించి కాలేజీ విద్యార్థులను కూడా ఒప్పించలేని వాదనలు ప్రధానంగా చేస్తున్నప్పటికీ, ఆ గందరగోళంలో కొన్ని అవసరమైన ప్రశ్నలు కూడా ఉన్నాయి. వివాహ ఒప్పందాల్లో స్త్రీలని బలహీన భాగస్వాములుగా గుర్తించి రూపొందించిన పౌర చట్టాల్లో వివాహం విచ్ఛిన్నమైనప్పుడు, భర్తలు వదిలేసినప్పుడు, హింసకి గురిచేసినప్పుడు స్త్రీలకి అవసరమైన రక్షణలని ఏర్పాటు చేశారు. ఇప్పుడు వివాహాల్లో భార్యాభర్తలిద్దరినీ సమానులుగా పరిగణిస్తే ఈ రక్షణలని ఎలా అమలు చెయ్యాలి, ఎవరిని బలహీన భాగస్వాములుగా గుర్తించాలి? కుటుంబ/ వివాహ చట్టాల్లో జెండర్ న్యూట్రాలిటీని తెస్తే లాభపడేది మన సమాజంలో పరలింగ వివాహ సంబంధాల్లోని స్త్రీలయితే కాదు. అయితే క్వీర్ వ్యక్తులుగా జీవించే అనేకమంది వివాహం గురించే కాక, అసలు కుటుంబం అంటే ఏమిటనే రాడికల్ ప్రశ్న కూడా వేస్తున్నారు. పెళ్లి చేసుకోకూడదని నిర్ణయించుకున్న వ్యక్తులకి, వాళ్ళు ట్రాన్స్ కావచ్చు, కాకపోవచ్చు, పర లింగ, సమ లింగ లైంగికత్వ వ్యక్తులు కావచ్చు, కుటుంబం ఏర్పాటు చేసుకునే అవకాశాలు ఏమున్నాయి, ముఖ్యంగా ఆయా కుటుంబాలు హింసాత్మకమైనవి అయినప్పుడు? కుటుంబం అంటే ఎంచుకోని రక్త సంబంధాలూ, తప్పని పెళ్లిళ్లతో ఏర్పాటు అయ్యేవేనా, స్నేహితులూ, దశాబ్దాలు కలిసి పని చేసిన కామ్రేడ్లూ కాదా? కలిసి జీవించే వాళ్లేనా, ఎప్పుడూ మనతో వివిధ ప్రయాణాలు చేసిన వాళ్ళు కాకూడదా? లేక కలిసి జీవించే వాళ్ళు, కలిసి ప్రయాణం చేసే వాళ్ళు రెండు రకాల వాళ్ళుకలిసి మన కుటుంబం ఎందుకు కాకూడదు? ఇలాంటి ప్రశ్నలతో వీరు పౌర చట్టాలలో హింసాత్మక కుటుంబాల నుంచి దూరమయ్యే వీలును, తమ తోడుగా ఉండే మనుషులకి గుర్తింపునిచ్చే వెసులు బాటును కల్పించమని కోరుతున్నారు. క్వీర్ వ్యక్తులు తమ జీవితాలని ఉదహరిస్తూ, ఆద్యంతం తమకి తోడున్న వ్యక్తులకి చట్టపరమైన గుర్తింపు ఇవ్వకుండా, క్లిష్ట సమయంలో కూడా తమని హింసించిన రక్త సంబంధీకుల సంతకాలకి మాత్రమే చట్టపరమైన గుర్తింపు నివ్వటం వల్ల అన్ని విధాలుగా అన్యాయానికి, క్షోభకి గురవుతున్నామని విజ్ఞప్తులు చేస్తున్నారు. ఇవి వారికే కాక మన సమాజంలో అనేక మందికి కూడా వర్తిస్తాయి.

# యురేనియంతో ప్రాణ సంకటం

యురేనియం రేడియో యాక్టివిటి ప్రభావం వల్ల ప్రజల ఆరోగ్యాలకు అత్యంత ప్రమాదం ఏర్పడుతుందని, పర్యావరణం సమతుల్యత దెబ్బతింటుందని పెద్ద ఎత్తున ఆందోళనలు సాగుతున్నాయి. ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లాలోని నల్లమల అడవుల్లో యురేనియం తవ్వకాలకు సర్వే ప్రారంభించాలని కేంద్రం అనుమతులు ఇవ్వడంతో ప్రజా సంఘాలు, ప్రజలు, స్వచ్ఛందంగా యురేనియం తవ్వకాలను వ్యతిరేకిస్తూ ఆందోళన కొనసాగిస్తున్నారు. బీజేపీ నాయకులు లక్ష్మణ్ నల్లమలలో యురేనియం తవ్వకాల వల్ల ఆ ప్రాంత ప్రజలు ఆర్థికంగా మెరుగు పడతారని, తవ్వకాలను అడ్డగించే ప్రజ లు అభివృద్ధి నిరోధకులని ఈ మధ్య విమర్శించారు. యురేనియం ప్రమాదం గురించి తెలియని నాయకుల వ్యాఖ్యలు ఇవి. యురేనియం తవ్వకాలు జరిగినప్పుడు వెలువడే 'డస్ట్' 80 కిలోమీటర్ల వరకు వ్యాపిస్తుంది. డస్ట్ పడిన ప్రాంతమంతా విషపూరితమవుతుంది. నల్లమలలోని చెంచుల ఉనికికి అత్యంత ప్రమాదం ఏర్పడుతుంది. యురేనియం తవ్వకాలు ప్రారంభిస్తే చెంచులను ఆ ప్రాంతం నుంచి తరలించాలి. నాగార్జున సాగర్ ప్రాజెక్టును తొలగించాలి. సాగర్ నీళ్ళు వ్యవసాయానికి గానీ, తాగడానికి గానీ ఉపయోగపడవు. ఇంత ప్రమాదకరమైన యురేనియం తవ్వకాలను కార్పొరేట్ల లాభాల కోసం బీజేపీ ప్రభుత్వం చేపట్టాలని చూస్తున్నది. యురేనియంతో విద్యుచ్ఛక్తి ఉత్పత్తి తేలికవుతుందని చెప్తూ తవ్వకాలకు కేంద్రం అనుమతులిచ్చింది. రష్యాలోని చెర్నోబిల్, జపాన్‌లోని పుకుషీమాలో యురేనియం విద్యుత్ కేంద్రాలు పేలిపోవడంతో వేలమంది మరణించడమే కాక, నేటికి ఆ రేడియో ధార్మిక శక్తి ప్రభావం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటున్నట్లు చెప్తున్నారు. ఆ భయంతో భారతదేశంలో ముఖ్యంగా తెలంగాణలో యురేనియం తవ్వకాలను ఆపాలని ఆందోళనలు సాగుతున్నాయి. 1896లో హెన్రీ బెకరల్ రెడియో ధార్మిక శక్తి 92వ మూలకాన్ని కనుగొన్నాడు. చదరపు అడుగు యురేని యం 500 కేజీల బరువు ఉంటుంది. న్యూక్లియర్ ఎనర్జీ ద్వారా అణుబాంబులు తయారు చేసిన ఆమెరి కా జపాన్‌లోని హిరోషిమా, నాగసాకిలపై వేసింది. ఆ ప్రాంతాల్లో ఇప్పటికీ రేడియో ధార్మిక శక్తి ప్రభావం కొనసాగుతూనే ఉన్నది. యురేనియంతో విద్యుత్ శక్తి ఉత్పత్తి చేయవచ్చు. 10 లక్షల కిలోల బొగ్గుతో ఉత్ప త్తి అయ్యే విద్యుత్ అరకిలో యురేనియంతో తయారు చేయవచ్చు. బొగ్గు ద్వారా విద్యుత్ ఉత్పత్తి వ్య యంతో కూడుకున్న పని అని యురేనియంతో ఉత్పత్తిని ప్రారంభించారు. మొదట ఈ నిక్షేపాలు మేఘాలయ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని దట్టమైన అడవుల కింద ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం భారత దేశంలో 7 కేంద్రాల్లో 22 రియాక్టర్లు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. 1950లో యురేనియం గనులను ఏ ర్పాటు చేశారు. 1967లో జాదూగూడలో గని ప్రా రంభించారు. యురేనియం ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరిగే ప్రక్రియలో యురేనియం శుద్ధి అవుతుంది. శుద్ధి అయిన యురేనియంను పైపులద్వారా బోరు బావిలోకి పంపిస్తారు. వాస్తవానికి ఈ శుద్ధిఅయిన యురేనియంతో అణుబాంబులు తయారు చేయవచ్చు. ఇక్కడ అణుబాంబులు తయారు చేసే లక్ష్యం లేనందున శుద్ధి అయిన యురేనియాన్ని బావుల్లోకి పంపిస్తున్నారు. తటస్థీకరణ చర్యకు సున్నపు రాయిని కూడా దానితోపాటు పంపాలి. యురేనియం భూమికి చాలా లోతులో ఉంటుంది. 1960లో వెయ్యి అడుగులలోతు వరకు బోర్లు వేసి తీశారు. అయినా తగినంత ఉత్పత్తి రాకపోవడంతో 1990లో ఎన్ఎస్‌జీ దేశాల నుంచి (కజకస్తాన్, కెనడా, రష్యా) దిగుమతు లు చేసుకున్నారు. ఈ దిగుమతులకు అమెరికా, ఐక్యరాజ్య సమితి అడ్డుపడ్డాయి. ఎన్‌జీఓ సంఘాలు యురేనియం వల్ల ప్రమాదాలు ఉన్నట్లు నివేదిక ఇచ్చాయి. పిల్లలు పుట్టకపోవడం, ఋతుక్రమం సరిగ్గా లేకపోవడం, క్యాన్సర్, చర్మ వ్యాధులు తదితర ప్రమాదాలు ఉన్నట్లు తెలిపారు. దీన్ని బాబా అటామిక్ రీసెర్చ్ వారు కూడా పరిశీలించారు. ఆ లోపాలు యురేనియం వల్ల కాదని తప్పుడు సమాచారం ఇచ్చారు. రేడియేషన్ వస్తుంది కానీ దాన్ని బయటకు సోకకుండా జాగ్రత్త తీసుకుంటున్నామని తెలిపారు. 1998లో ప్రధాని వాజపేయి జా దూగూడ కాక వేరే ఎక్కడైన యురేనియం లభ్యత ఉందా అని పరిశీలించారు. ఈ స్థితిలో ప్లూటోనియాన్ని కనుగొన్నారు. ప్లూటోనియంతో తయారు చేసిన అణుబాంబును పోక్రాన్‌లో పరీక్షించారు. చివరకు 2002లో చంద్రబాబు అనుమతితో జరిపిన అన్వేషణలో కడప జిల్లా తుమ్మలపల్లి, గుంటూరు జిల్లా కోపూరులోని 2,300 ఎకరాల్లో నిల్వలు ఉన్నట్లు కనుగొన్నారు. 1.40 లక్షల టన్నులు తుమ్మల పల్లిలో, 2500 టన్నులు కోపూరులోనూ బయటకు తీశారు. 2004 లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కూడా యురేనియం తవ్వకాలకు అనుమతి ఇచ్చారు. యుసీఐఎల్ దృష్టి ఇప్పు డు నల్లమలపై పడింది. ఇక్కడ యురేనియం తవ్వకాల వల్ల కృష్ణానది కలుషితం అవుతుందని ప్రచారం సాగుతున్నది. ప్రస్తుతం దేశంలో మరో 7 అణు రి యాక్టర్లు నిర్మాణంలో ఉన్నాయి. వీటికి యురేనియం కావాలి. అందుకు దిగుమతులపై ఆధారపడాలి.

## టీడీపీ ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమం



పల్నాడు జిల్లా .నరసరావుపేట .మే 2 (ప్రజాపాలన ప్రతినిధి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నరసరావుపేట నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిశీలకులు మన్నవ మోహన్ కృష్ణ పాల్గొని,పట్టణ పార్టీ అధ్యక్షులు కడియాల రమేష్ అధ్యక్షతన వహించారు.ఇందులో భాగంగా టీడీపీ నేత రాజశేఖర్ ఓటర్ వెరిఫికేషన్,హౌస్ మ్యాపింగ్ పై ట్రైనింగ్ ఇచ్చారు.అలాగే మరాళ్ల అప్పారావు,రవి టీడీపీ యాప్‌లోని ఫ్యూచర్స్ పై వివరించారు.అనంతరం ఆర్టీఎస్ గురించి కుమ్మేత కోటిరెడ్డి శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా పరిశీలకులు మన్నవ మోహన్ కృష్ణ మాట్లాడుతూ...ఎన్నికలు ఎప్పుడు జరిగినా పార్టీ విజయంలో కీలకపాత్ర పోషించే ప్రతి అంశాన్ని క్యాడర్ అందిపుచ్చుకోవాలి అని తెలిపారు.అరాచకవాది జగన్ రెడ్డి పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కలిగించడం కోసం అందరూ కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు.డా.చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ.....వైసీపీ అరాచకాల పై రాష్ట్ర ప్రజలాందరూ తిరుగుబాటు చేస్తున్నారని గడప గడపకు వెళ్ళిన ఎమ్మెల్యేలకు,మంత్రులకు ప్రజలు చెప్పులతో సమాధానం చెబుతున్నారని ఎద్దేవా చేశారు.తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు,రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రాము,దారు నాయక్,హెచ్ ఆర్ డి డైరెక్టర్ మెంబెర్ వల్లెపు నాగేశ్వరరావు,గొట్టిపాటి జనార్ధన్ బాబు,కొట్ట కిరణ్,మన్నన్ షరీఫ్,మీరవాలి,మానుకొండ జాహ్నవి,కనుమూరి లక్ష్మీ,దాసరి ఉదయ్ శ్రీ,తిరుమలకొండ నరసింహారావు,మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి,మొండితోక రామారావు,మద్దిరాల గంగాధర్,మాబు,అత్తులూరి సుబ్బారావు,చింతిరాల బాలు,కొల్లిపాక చంద్రశేఖర్,పోనుగోటి శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.


## అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి

**టిడిపి రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి దారు నాయక్**



పల్నాడు జిల్లా .నరసరావుపేట. మే 2 (ప్రజాపాలన ప్రతినిధి.): పల్నాడు జిల్లా టీడీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి దారు నాయక్ మాట్లాడుతూ జిల్లాలో అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. టీడీపీ హయాంలో వరదలు వచ్చి రైతులు నష్ట పోయిన రైతులకి బడ్జెట్ లో ప్రత్యేక నిధులను కేటాయించి నష్ట పరిహారం ఇచ్చి ఆదుకున్నదని వైసీపీ ప్రభుత్వ హయాంలో మాత్రం రైతులను పట్టించుకున్న పాపానపోలేదని అన్నారు . రైతుల ఆవేదన చూస్తుంటే వాళ్ళ గోడు వైన్ నాధుడే లేకుండా పోయాడు.గతంలో ఆంధ్రప్రదేశ్ అంటే అన్నపూర్ణ రాష్ట్రంగా పేరుండేది ,ఇప్పుడు సీఎం జగన్ మోహన్ రెడ్డి మన రాష్ట్రం అంటేనే అభాసుపాలుగా చేశారు. రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్ధనబాబు మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాల వలన రైతులకు దెబ్బ మీద దెబ్బ పడింది అని,ఆరుగాలం రైతులు కష్ట పడి పండించిన పంట మొత్తం వర్షాలకు దెబ్బ తిన్నదని , నష్ట పోయిన రైతులకు కులాలకు మతాలకు అతీతంగా అధికారులు పంట నష్టాన్ని అంచనా వేయాలని కోరారు..అలాగే రైతు భరోసా కేంద్రాల నుండి ఎలాంటి షరతులు లేకుండా తడిసిన మొక్కజొన్న,మిర్చి మొత్తాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు .రైతులకు వెంటనే మరో పంట వేసుకోవడానికి వడ్డీ లేని రుణాలను బ్యాంకుల నుండి మంజూరు చేయాలనీ కోరారు. రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి మద్దిరాల గంగాధర్ మాట్లాడుతూ రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని, అలాంటి రైతులు కన్నీళ్లు పెట్టుకోవటం మన రాష్ట్రానికే మంచిది కాదని అన్నారు. ఈ సమావేశంలో ఎస్టీ సెల్ నేత కొండ్రాతి సాంబయ్య పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల్లో బయటపడ్డ పురాతన శివలింగం....



గోకవరం ప్రజా పాలన మే 2: పెంటపల్లి గ్రామం మర్రివాని చెరువులో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తుండగా పురాతన శివలింగం బయటపడింది. దీనికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం పెంటపల్లి గ్రామంలో మర్రివాని చెరువులో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తుండగా పురాతన శివలింగం ప్రత్యక్షమయ్యింది శివలింగం పై పాదముద్రలు ఉండడంతో భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చి పూజాధికాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే గ్రామంలో శివాలయం నిర్మించాలని గ్రామస్తులు ఆలోచనలో ఉండటంతో పురాతన శివలింగం బయటపడడంతో గ్రామస్తుల ఆశ్చర్యానికి ,ఆనందానికి అవధులు లేవు. శివలింగం దొరకడం తమ అదృష్టమని భావించి ఆలయ నిర్మాణానికి ఏర్పాట్లు కావిస్తున్నారు.

# నల్లపాటి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా కార్మిక దినోత్సవ వేడుకలు

పల్నాడు జిల్లా. నరసరావుపేట .మే 2 (ప్రజాపాలన ప్రతినిధి.): ఆరోగ్యకరమైన నరసరావుపేటకు కారకులైన పారిశుధ్య కార్మికులను మేడే సందర్భంగా సత్కరించుకోవడం ఎంతో సంతృప్తినిచ్చిందని నల్లపాటి ట్రస్ట్ అధినేత నల్లపాటి రామచంద్రప్రసాద్ (రాము) అన్నారు. అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం స్థానిక ప్రకాష్ నగర్ లోని నల్లపాటి వారి సప్తపది కళ్యాణ మండపం నందు, నల్లపాటి ట్రస్ట్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి గౌరవ అతిధిగా విచ్చేసిన టీడీపీ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ చదలవాడ అరవింద్ బాబు మాట్లాడుతూ.. నల్లపాటి ట్రస్ట్ ద్వారా తన తల్లిగారైన





నల్లపాటి ప్రమీలాదేవి పేరుపై నల్లపాటి రామచంద్రప్రసాద్ (రాము) చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయ మన్నారు. పారిశుధ్య కార్మికులతో కలిసి ఈ మేడే వేడుకల్లో పాలుపంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం నల్లపాటి రామచంద్రప్రసాద్ (రాము) మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యకరమైన జీవనానికి, పరిశుభ్రమైన పట్టణ వాతావరణానికి పారిశుధ్య కార్మికులు ఎనలేని సేవ చేస్తున్నారన్నారు. మేడే సందర్భంగా కార్మికుల సంక్షేమానికి అన్ని విధాలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. నల్లపాటి ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్న మెడికల్ క్యాంప్ లు కార్మిక వాడల్లోనూ ఏర్పాటు చేస్తామని, ఆర్థిక ఇబ్బందులతో పిల్లలని చదివించలేని స్థితిలో ఉన్నవారు తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్మికుల హక్కుల కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులు షేక్ నిజాంబుడే గారిని అరవింద్ బాబుతో కలిసి నల్లపాటి రాము ఘనంగా సత్కరించారు. అనంతరం మేడే వేడుకలకు సంబంధించిన కేక్ ను కట్ చేసి కార్మికులతో పంచుకోవడంతో పాటు సుమారు 500 మందికి నల్లపాటి చేతుల మీదుగా నూతన వస్త్రాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, సిఐటియు జిల్లా కోశాధికారి శివకుమారి, సిఐటియు మండల అధ్యక్షులు సిలార్, వార్డ్ 3 టీడీపీ మాజీ టౌన్ సెక్రటరీ ఉటుకూరి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు కొరిటాల శ్రీను, అడుసుమల్లి అప్పారావు, కొర్రపాటి శ్రీనివాసరావు, కట్ల శ్రీను, షేక్ ఫిరోజ్, అల్లూరి సుధాకర్, ఎర్రమాసు ప్రసాద్, కృష్ణ, మేడబోలిన నవీన్ కుమార్, అడసా రాంబాబు, జవ్వాజి హరిబాబు, కార్మిక సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నవరత్నాలతో ఇంటింటా సంక్షేమ కాంతులు




పల్నాడు జిల్లా .నరసరావుపేట. మే 2 (ప్రజా పాలన ప్రతినిధి)నవరత్నాలతో ఇంటింటా సంక్షేమ కాంతులు వెదజల్లుతున్నాయని మూడేళ్ల లో అందించిన అభివృద్ధి సంక్షేమ పాలనతో సగర్వంగా ప్రజల ముందుకు వెళున్నామని నరసరావుపేట శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం భాగంగా పట్టణంలోని రెండవ రోజు 12వ వార్డులోనే స్వామి స్కూల్ నందు నుంచి ప్రారంభించారు, ప్రజలు పూలమాలలతో, మంగళ హారతులతో స్వాగతం పలికారు. గౌరవ శాసనసభ్యులు డా. గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి వార్డులో ప్రతి గడపను సందర్శించి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారు చేపట్టిన సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా గౌరవ శాసనసభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి 12వ వార్డ్ లో గల సమస్యలను తెలుసుకొని అక్కడే గల ప్రభుత్వ అధికారులతో మాట్లాడి పరిష్కరించదగ్గ సమస్యలను పరిష్కరించారు. సత్వరమే పరిష్కారం కాని సమస్యలను పై అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించే విధంగా ఆదేశించారు, 12వ వార్డ్ సచివాలయం పరిధిలో గడప గడపకు మనప్రభత్వం కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో కూడా ప్రజా ప్రతినిధులు ఇంటింటిని సందర్శించే కార్యక్రమం జరుగుతున్నదన్నారు. ఇదంతా కూడా ప్రజల అవసరాలను తెలుసుకొని వారికి ఏమీ అవసరమో వాటినిబట్టి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసుకునే విధంగా ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. చిట్టచివరి లబ్ధిదారునికి లబ్ధి చేకూరడమే లక్ష్యంగా రాష్ట్రంలో జగనన్న ప్రజారంజక పాలనను తీసుకువచ్చారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సంక్షేమ పథకాలు అన్నటువంటివి లబ్ధిదారుని ఇంటి వద్దకే చేరవేయడంతో ప్రభుత్వ పాలనను ప్రజల చెంతకు చేర్చారన్నారు. ప్రజల కోసం ఇంత పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టిన జగన్మోహన్ రెడ్డి గారికి ప్రజలందరి తరపున ధన్యవాదాలు తెలిపారు..బిఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వార్డ్ ఇన్చార్జులు, వివిధ శాఖల చైర్మన్ లు, డైరెక్టర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కన్వీనర్లు, అధికారులు, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు మరియు మహిళా అభిమానులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కొడాలి నానికి దమ్ముంటే నెహ్రూచౌక్‌లో రంగా విగ్రహం పెట్టించు..: టిడిపి సినియర్ నాయకుడు



గుడివాడ : మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి నాని ఎన్నికల్లో రంగా బోమ్మ పెట్టుకుని కాపులు ఓట్లు దండుకోవడం జరుగుతుందని, గతంలో కొడాలి నాని ఇచ్చిన మాటా ప్రకారం స్థానికి నెహ్రుచౌక్‌లో వంగవీటి రంగా విగ్రహం ఏర్పాటు చేస్తే గుడివాడ నడ్డి బోడ్డులో మీసాలు, గుండు కొట్టించుకుని తిరుగుతా నీకు సలామ్ చేస్తానాని టిడిపి సినియర్ నాయకుడు కాపు సంఘం సభ్యుడు పంద్రాజు సాంబశివరావు సవాల్ విసిరారు. మంగళవారం స్థానికి టిడిపి కార్యాలయంలో కాపు నాయకులతో కలసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడుతూ కాపులను కించపరిచే వ్యక్తి రెడ్డిలకు పెద్ద పాలేరుగా వ్యవహరించే పేర్ని నాని గుడివాడలో జరిగిన ఒక కార్యక్రమంలో కొడాలి నానిని గుర్చి గొప్పలు చెప్పాడం విడురంగా ఉందన్నారు. కాపు సమాజంలో పుట్టిన నీవు అదే సామాజిక వర్గం చెందిన వారిని కించపరుస్తూ మాట్లాడిన నీచ సంస్కృతి నీది అన్నారు. ముందు బందరు అభివృద్ధి పూర్తిగా చేయకుండ, కాపులు ఇచ్చిన చందాలతో ఎమ్మెల్యే అయినట్లు మరిచిపోయవన్నారు. నీది నువ్వు కడుక్కో తర్వాత గుడివాడ వచ్చి నానికి సర్టిఫికెట్ ఇవ్వచ్చున్నారు. మచిలీపట్నం బస్టాండు మరియు కోనేరు సెంటర్లలో చిన్న వర్షం వస్తేనే మొల లోతూ మునిగిపోతా ఉంటుంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ ఉంటారు. బందరులో పేర్ని నాని మరియు గుడివాడలో కొడాలి నానిని ఓడించడానికి కాపు సహోదరులందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. కొడాలి నాని నీవు చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌ల గడ్డంలోని వెంట్రుక కుడా నువ్వు పీకలేవన్నారు. నువ్వు రంగా అభిమానివి కాదు, ఎన్నికలకు ముందే ఆయన బొమ్మ నీకు గుర్తుకువస్తుంది, అయన బొమ్మను అడ్డం పెట్టుకుని అయన కుమారుడు వంగవీటి రాధాని అడ్డం పెట్టుకుని ఇన్ని రోజులు రాజకీయాలు చేసావాన్నరు. అనేక మంది మా కాపు సోదరుల కుటుంబాలు విచ్ఛిన్నం అవడానికి కారణం నీవు కాదన్నారు. కొడాలి నానీ నీకు దమ్ముంటే నెహ్రూచౌక్‌లో రంగా విగ్రహ ప్రతిష్టకు 2రోజులో పర్మిషన్ ఇప్పించు చూదమన్నారు. గుడివాడకు తొలి ఎమ్మెల్యే గంజి రామారావుతో మొదలుకొని నందమూరి తారకరామారావు, రావి శోభనాద్రి వంటి గొప్పవారు ఎమ్మెల్యేలగా ప్రాతినిధ్యం వహించి, గొప్ప కీర్తిని తీసుకువచ్చారన్నారు. కానీ నువ్వు నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి బూతుల గుడివాడగా, పేకాట గుడివాడగా, క్యాసినో గుడివాడగా, భూకబ్జాల గుడివాడగా, అపకీర్తిని మూటగట్టావు గుడివాడ పేరు చెప్పుకోవాలంటే సిగ్గుపడేలా చేశావన్నారు. ఇప్పటికైన నీ రాజకీయం కోసం కాపులను బలిపశువులను చేయవద్దని, గుడివాడలో టిడిపి తరపున పోటి చేసేది రావి వెంకటేశ్వరరావు అయనపై నీకు దమ్ముంటే అయనపై గెలవలన్నారు. ఈ కార్యక్రమంలో రాధా రంగా మిత్రమండలి సభ్యులు టిడిపి నాయకులు పట్టపు చిన్న, చీకటి శేషగిరిరావు, దేవాది నాగేశ్వరరావు, దారపురెడ్డి శేషు, తేనేల ఏడుకొండలు, వరుపుల వెంకట్రావు, బచ్చల నానాజీ, వంగలపూడి రమణ, ఈపూరి పెద్దిరాజులు, సిరిపల్లి చంద్రశేఖర్, దాసరి మహేష్, పెద్ది చందర్రావు, పెద్ది అర్జున్, వడ్లాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వర్షంతో రోడ్లపై చేరిన వర్షపు నీరు



కారంపూడి... మే02...ప్రజాపాలన... ప్రతినిది :మండలంలోని వాహనదారులకు ఇబ్బందికరంగా మారిన వర్షపు నీరు మండలంలోని గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు జలమయమయ్యాయి బస్టాండ్ సెంటర్లోని వర్షపు నీరు మోకాళ్ళ లోతు వరకు నిలువు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు వర్షం కారణంగా రైతన్నలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు పంట చేతికి వచ్చే టయానికి వర్షం కురవడంతో వరి పంట తీవ్ర నష్టాన్ని గురైంది అని రైతన్నలు గగ్గోలు పెడుతున్నారు రోడ్లు గుంతల మయంగా మారడంతో ఆర్ అండ్ బి అధికారులు గుంతలు పోర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు ఆర్ అండ్ బి అధికారులు తాత్కాలిక గా చేస్తున్నారు తప్ప పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

## అపూర్వ కలయికలో ఎన్నో తీపి జ్ఞాపకాలు: రుద్రపాక పాఠశాల ఉపాధ్యాయులు



గుడివాడ : ఏరా.. ఏం చేస్తున్నావ్.. ఎలా ఉన్నావ్...ఎక్కడ ఉంటున్నావ్... అని తోటి విద్యార్థులు, మాస్టారూ బాగున్నారా.. అని గురువుల్ని ఆప్యాయంగా శిష్యుల పలకరింపులతో అపూర్వ కలయిక ఆధ్యాంతం ఉత్సాహంగా కొనసాగింది. 35 క్రితం పదోతరగతిలో విద్యను అభ్యసించిన సహచరులు, విద్యా బోధన చేసిన గురువుల పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి పిన్నమనేని వీరయ్యచౌదరి మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రుద్రపాకలో 1983-88 పుర్వవిద్యార్థుల కలయిక మంగళవారం గుడివాడలోని ఏలూరురోడ్డులో ఉన్న శ్రీవెంకటేశ్వర పంక్షనహాల్‌లో వేదికగా నిలిచింది. విద్యార్థులు ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఆటపాటలతో అపూర్వ కలయికకు వన్నె తెచ్చారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు విద్యా బుద్ధులు నేర్పి ఉన్నత శిఖరాలకు అధిరోహించేందుకు దోహదపడిన గురువులకు పాదాభివందనాలు చేసి ఆశీర్వచనాలు తీసుకున్నారు. విద్యార్థులు తమ తోటి సహచరుల మంచి చెడులను అడిగి తెలుసుకున్నారు. కొందరు తమ పిల్లలతో మరికొందరు తమ జీవిత సహచరులతో సమ్మేళనానికి విచ్చేయడంతో పంక్షన్‌హాల్ ఆవరణ కళాకాంతులతో నిండింది. ఏలూరురోడ్డు పూర్వ విద్యార్థులతో నిండాయి. తాము చిన్నప్పటి నుంచి చదువుకున్న, ఆడుకున్న ప్రాంతాలు, తరగతి గదులలో సేద తీరినా తమ తీపి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఈ క్రమంలో మంచి పనులు, సేవా కార్యక్రమాలు చేసేందుకు ప్రణాళికను రచించుకునేందుకు ఈ సమ్మేళనం వేదికగా నిలిచింది. సాయంత్రంకు విద్యార్థుల్లో నిరాశ నిస్పృహలు చోటు చేసుకున్నాయి. 35 ఏళ్ళ తరువాత కలిసిన తాము తిరిగి విడిపోతున్నామనే బాధ పూర్వ విద్యార్థుల కళ్లల్లో స్పష్టంగా కనిపించింది. ప్రతి ఏడాది ఏదో ఒక సందర్భంలోనైనా అందరూ కలవాలి అనే ఆలోచన ప్రతి ఒక్కరి మనుసుల్లోనూ మెదిల్లింది. దీనికి కార్యరూపణ దాల్చేందుకు సంసిద్దులు అవుదామని నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా గురువులు గుత్తా రమేష్, కె.సత్యనారాయణ, తుర్లపాటి జగన్‌మోహనరావు, పొట్లూరి శేషగిరిరావు, చైతన్యపార్దులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యమ్రాన్ని వీక్షించేందుకు పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సమ్మేళనాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేసిన గూడపాటి నిర్మల, గుత్తా ఫణిప్రసాద్, పి.మురళీ, పి.సుధాకర్, టి.శ్రీను, కె.శ్రీనివాసరావు, పి.ఉమా, వి.శ్రీనివాసరావు, జ్యోత్న, పూర్వవిద్యార్థులను పలువురు అభినందించారు. ఈ కలయికలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల్లో భారీ అవకతవకలు



నందిగామ మే 2 ప్రజా పాలన ప్రతినిధి: నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలలో ఉపాధి హామీ ప నుల్లో. పూర్తిస్థాయిలో అవకతవకలు జరుగుతున్నా యని మా దృష్టికి వచ్చిదని ఆ పథకం యొక్క ముఖ్య ఉద్దేశం పేద ప్రజలకు ఎండాకాలంలో పని ఉండదు కా బట్టి వారి జీవనోపాధికి పని కల్పించి దాని ద్వారా ల బ్ధి పొందాలా అనే ఒక్క సదుద్దేశంతో ఈ పథకం అమ లు చేస్తుంది కేంద్రం కానీ రాష్ట్ర ప్రభుత్వం లోని నాయ కులు దీన్ని ఒక ఆదాయం వనరుగా చూస్తూ సామా న్య ప్రజలనీ వేధిస్తూ వారి శ్రమని దోచుకుంటున్నారు కరువు పనికి వెళ్ళనీ వారికి వేరే ప్రాంతాలలో ఉన్న వారికి కూడా కరువు పని కార్డు ఇచ్చి 50 50 వాటా వేసుకుంటున్న నాయకులు పని జరిగే ప్రాంతంలో ప రిశీలిస్తే హాజరు శాతం లో 30% ప్రజలు కూడా లేరు కొన్ని ప్రదేశాల్లో నందిగామ నియోజకవర్గంలో దీన్ని పూర్తిగా అరికట్టి ఉపాధి హామీ కూలీలకు న్యాయం చేయాలని ఈ యొక్క అవినీతి సొమ్ము నాయకులు అధికారులు ఎవరు ఏం చేస్తున్నారు కూలీల కడుపు కొట్టి. కూడా కోట్లు కూడా పెడుతున్నారు ప్రతి ఒక్క ప ని మీద ఎంక్వయిరీ ఏసి ప్రజలకు సరైన న్యాయం జ రిగేదాకా భారతీయ జనతా పార్టీ ప్రశ్నిస్తూనే ఉంటుం దని కనీస అవసరాలు మంచినీరు. ఫస్ట్ ఎయిడ్ సెం టర్ పని జరిగే ప్రదేశంలో ఉంచాలని భారతీయ జన తా పార్టీ డిమాండ్ చేస్తుంది. దీనిపైట్క తక్షణమే స్పందిం చి తగ్గు చర్యలు తీసుకోవాలని స్థానిక ఆర్డిఓ రవీంద్ర రావుకి భారతీయ జనత్గా పార్టీ నాయకులు వినతి పత్రం సమర్పించారు ఈ కార్యక్రమంలో నియో జకవ ర్గ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య పట్టణ అధ్య క్షు డు పులిపాటి లక్ష్మణరావు మండల అధ్యక్షుడు గం టా వెంకట్రావు కే శ్రీదేవి. బండారు కేదార్నాథ్ శర్మ నం బూరిఅశోక్,చిరుమామిళ్ల శ్రీనివాసరావులక్ష్మీకాంత్.యరగొరల లక్ష్మణ్ తులసి కృష్ణ ఎస్కే సుభాని వీ సం రాఘవ మునగంటి కామేశ్వరరావు బుర్ర వెంక ట్రావు. తదితరులు పాల్గొన్నారు

## ద్వితీయ వర్ధంతి సందర్భంగా పులిహోర, మజ్జిగ, పంపిణీ



కారంపూడి... మే02...ప్రజాపాలన... ప్రతినిధి. :పట్టణము లో నీ గాంధీ బొమ్మ సెంటర్లో వాసవి సేవాదళ్ చలివేంద్రం వద్ద గుండా నాగలక్ష్మి దీప ద్వితీయ వర్ధంతి సందర్భంగా 400 మందికి పులిహోర, 150 లీటర్ల మజ్జిగ పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో సురె బాబు సత్యవతి వాసవి సేవాదళ్ జిల్లా అధ్యక్షులు భవిరిశెట్టి రామారావు ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు ఆతుకూరి. గోపి, ఎస్పిఆర్ .కృష్ణ, పోలూరి. శ్రీనివాసరావు, కొత్త.బ్రహ్మేశ్వరరావు, సూరే .నాగేశ్వరావు సూరే. ఈశ్వర్ భవిరిశెట్టి. గురవయ్య సూరే. హనుమంతరావు గుప్త మరియు కళా సిల్క్స్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీ శ్రీమతి డి మేరీ ప్రశాంతి ఐపీఎస్ వారు డిఎస్పీ లు సీఐ లు ఎస్ఐ లు మరియు పోలీస్ సిబ్బంది తో వీడియో కాన్ఫరెన్స్



ఏలూరు,ప్రజాపాలన ప్రతినిధి : అవినీతి రహిత ఉద్యోగ నిర్వహణ చేయాలని ఏలూరు జిల్లా ఎస్పీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లో ఏర్పాటు చేసినారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిస్సింగ్ కేసులు, బాలికలు మరియు మహిళాల పట్ల జరుగుతున్న అఘాయిత్యాల పట్ల త్వరితగతిన విచారణ జరిపి సదరు కేసులలో ముద్దాయి పై చర్యలు తీసుకోవాలని అధికారులకు తగిన సూచనలు సలహాలను మరియు ఆదేశాలను ఇచ్చినారు. సిబ్బంది ఉద్యోగ నిర్వహణ లో అలసత్వాము ప్రదర్శిస్తే శాఖ పరమైనటువంటి చర్యలు తీసుకుంటామని, బాధిత ఫిర్యాదుదారులు పోలీస్ స్టేషన్ కి వస్తే వారితో మర్యాద పూర్వకంగా నేర్చుకోవాలని, పోలీస్ స్టేషన్ రిసెప్షన్ వద్ద ఉండే మహిళా సిబ్బంది ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులు చర్యలు తీసుకునే లాగా రికార్డులను నిర్వహించాలని, ప్రజలు మెచ్చే లాగా నేరస్తులు భయపడే విధముగా సిబ్బంది ఉద్యోగ నిర్వహణ చేయాలని, పోలీసు సిబ్బంది యాక్టివ్ గా ఉండడమే కాదు ప్రో యాక్టివ్ గా ఉండాలని, సింపతి తో కాకుండా ఇంపతితో ఉద్యోగ నిర్వహణ చేయాలని,మారుతున్న చట్టాలకు అనుగుణంగా సిబ్బంది ఉద్యోగ నిర్వహణ చేయాలని, కేసులు దర్యాప్తు లలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ముద్దాయిలను అరెస్టు చేయాలని, ఏదైనా సమస్య చిన్నదిగా ఉన్న సమయంలోనే అధికారులు స్పందించి సదరు సమస్యపై సత్వరమే చర్యలు తీసుకోవడం వలన అది శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉంటాదని, దర్యాప్తులో ఉన్న కేసులలో దర్యాప్తు ను పూర్తి చేయుట కొరకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి, దర్యాప్తులను పూర్తి చేసి కోర్టులో ముద్దాయిలను ప్రవేశపెట్టడం వలన బాధితులకు భరోసా కల్పించినా వారు అవుతారని ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిబ్బందికి ఉద్యోగ నిర్వహణ లో సిబ్బందికి దశ, దిశ పలు సూచనలు సలహాలు మరియు ఆదేశాలు ఇచ్చినారు.

## టిడిపి పార్టీ ఉనికి కోసం తెదేపా నాయకుల అసత్య ఆరోపణలు.. ఖండించిన వైసీపీ నాయకులు




పొన్నూరు:( ప్రజా పాలన ప్రతినిధి) :కనుమరుగవుతున్న తెలుగుదేశం పార్టీ ఉనికిని కాపాడేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై అభివృద్ధి పనులపై అసత్య ప్రేలాపనలు పేలుతున్నారని పొన్నూరు పట్టణ వైఎస్ఆర్సిపి నాయకుడు, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు మంగళవారం విలేకరుల సమావేశంలో ధ్వజమెత్తారు. స్థానిక 26 వార్డులో గత సోమవారం కూలిపోయిన డ్రైనేజీ కాలువను ఆ పార్టీ నాయకులతో కలిసి వెళ్లి పరిశీలించి మాట్లాడారు. అభివృద్ధి పనులు జరుగుతున్న డ్రైనేజ్ ప్రక్కన మార్కెట్ గౌస్ ఇంటి ప్రహరీ గోడ కూలి పోవటం వలన నిర్మాణంలో ఉన్న డ్రైనేజీ గోడ లు పై పడిపోయాయని ఈ నేపథ్యంలో గోడలు కూలిన ఘటన జరిగిందని పేర్కొన్నారు. నిజ నిజాలు తెలుసుకోకుండా అసత్య ప్రచారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత ప్రమాణాలలో ఎటువంటి రాజీ లేకుండా పొన్నూరు పట్టణంలో అనేకమైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేవలం పార్టీ మనుగడ కోసమే లేనిపోని అసత్య ఆరోపణలు తెలుగుదేశం నాయకులు చేస్తున్నారని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. త్వరలో కూలిపోయిన డ్రైనేజీ కాలువను పునర్మించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బొద్దులూరి రంగారావు, వట్టిప్రోలు రంగారావు, అమీర్నేని సాంబశివరావు, భవనంవంశిరెడ్డి, కొల్లేరు శ్రీనివాసరావు, రుద్రపాటి ఆదిశేషు, మహమ్మద్ ,షేక్ నయుం భాష ,అనిత తదితరులు పాల్గొన్నారు.

## ఈవో గోపి తన వ్యవహారశైలి మార్చుకోవాలి: డా.చదలవాడ అరవిందబాబు



పల్నాడు జిల్లా నరసరావుపేట మే 2. (ప్రజాపాలన ప్రతినిధి. ): త్రికోటేశ్వర స్వామి దేవస్థాన ఆలయ ఈవో గోపి అర్చకుల పై అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు ఆరోపించారు.త్రికోటేశ్వర స్వామి ఆలయ ఈవో గోపి, ప్రధాన అర్చకుల మధ్య వివాదం పై నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ మాట్లాడుతూ...... స్వామి వారికి ధూప,దీప నైవేద్యాలతో నిత్యం పూజలు చేస్తూ స్వామి వారి సేవలో తరించే అర్చకుల పై ఈవో వేమూరు గోపి దుర్భాసలాడడం బాధాకరమన్నారు.ఆలయ కమిటీ చైర్మన్,ఈవోలు ఆలయ ప్రతిష్టను కాపాడాల్సి ఉండగా అవినీతి చేస్తూ ప్రశ్నించిన అర్చకుల పై బెదిరింపులకు పాల్పడడం ఉన్మాద రాజకీయాలకు నిదర్శనమన్నారు.ఏ అధికారాన్ని ఆశించకుండా స్వామి వారి సేవలో నిత్యం తరించే దైఓపాసకులైన అర్చకులను బెదిరించి అవినీతిని కప్పిపుచ్చు కోవాలనుకోవడం వైసీపీ నీచ రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు.కోటప్పకొండ పవిత్రతను ఆలయ కమిటీ చైర్మన్,ఈవోలు కాపాడాల్సి ఉండగా అర్చకుల పై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ కోటప్పకొండను వివాదాల్లోకి లాగుతున్నారని ఆరోపించారు.కోటప్పకొండ పవిత్ర పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుందని వైజాగ్,రాజమండ్రి లాంటి సుదూర ప్రాంతాల నుండి కూడా భక్తులు వస్తారని వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసి కోటప్పకొండ పవిత్రతను కాపాడాలని సూచించారు.కోటప్పకొండ ఈవో వేమూరి గోపి,అర్చకుల మధ్య వివాదం వలన కోటప్పకొండ ప్రతిష్టకు భంగం వాటిల్లుతుందని డా.చదలవాడ అరవింద బాబు బాబు వాపోయారు.4వ తేదీ నుంచి ఆర్జిత సేవలు నిలిపివేస్తామంటూ అర్చకుల నోటీస్ ఇవ్వడం,ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా ఆలయంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారంటూ అర్చకులు మాట్లాడడం ఈవో,ఆలయ కమిటీ చైర్మన్ అవినీతికి అద్దం పడుతుందన్నారు.ఈవో పై ఫిర్యాదును అర్చకులు ఈవోకె అందించారని ఈవో పూజారుల మధ్య వివాదం కోటప్పకొండ ప్రతిష్టకు భంగం వాటిల్లుతుందని డా.చదలవాడ అరవింద బాబు ఆవేదన వ్యక్తం చేశారు.దేవస్థాన సిబ్బంది ఆగమ శాస్త్రం ప్రకారం పూజలు నిర్వహిస్తూ అర్జిత సేవలు నిలిపివేయడానికి నిర్ణయించారని ఈ విషయంలో కలెక్టర్ కలగజేసుకొని కోటప్పకొండ లో జరిగిన అవినీతి పై విచారణ జరిపించాలని డా.చదలవాడ కోరారు.

## మూలపాలెం రైతు ఆనందరావుకు ఆర్మీ విజయ్ ఆపన్న హస్తం



బాపట్ల జిల్లా ప్రజా పాలన మే 2 :పిడుగుపాటుకు వరి కుప్ప దగ్ధమైన రైతుకి రూ. 50 వేలు అందజేత పిడుగుపాటుకు వరికుప్ప దగ్ధమైన రైతుకు యువ పారిశ్రామికవేత్త కాటి విజయకుమార్ (ఆర్మీ విజయ్)రూ. 50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. బాపట్ల మండలం మూలపాలెం గ్రామానికి చెందిన మార్పు ఆనందరావు కు చెందిన రెండున్నర ఎకరం వరికుప్ప ఆదివారం అర్ధరాత్రి పడిన పిడుగు దాటికి వరికుప్ప పూర్తిగా దగ్ధమైంది. సన్నిహితుల ద్వారా విషయం తెలుసుకున్న విజయ్ మంగళవారం గ్రామానికి చేరుకొని రైతు ఆనందరావు కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూఆరుగాలం కష్టించి సాగు చేసి ధాన్యం ఇంటికి చేరే తరుణంలో అకాల వర్షం దాటికి పిడుగు పడి వరికుప్ప దగ్ధమవడం శోచనీయం అన్నారు. ఎండనక వాననక కష్టించి సాగు చేస్తే పకృతి వైపరీత్యం రైతు కష్టం పై పగబట్టటం బాధాకరమన్నారు. రైతు లేనిదే మానవ మనుగడే లేదని ప్రకృతి వైపరీత్యాలు రైతు సహనం ముందు చిన్నబోతుందని ఆయన తెలిపారు. అధైర్య పడవద్దని ఏ అవసరం ఉన్న నా వంతుగా సహాయం చేసేందుకు వెనకాడబోనని ధైర్యంగా ఉండాలని రైతు విజయ్ భరోసా ఇచ్చారు. అనంతరం గ్రామస్తులు విజయ్ ను పూలమాలతో ఘనంగా సత్కరించారు. తొలుత గ్రామంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి గ్రామ పెద్దలతో కలిసి విజయ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లాయర్లు బిళ్ళా స్టాన్లీ విమల్ కుమార్, బిళ్లా కమల్ కుమార్, జోగి బుల్లబ్బాయి, గ్రామ పెద్దలు వడ్డిముక్కల మోషే, బెజ్జం రాజు, సాధు వీరయ్య, గొరెముచ్చు వసంత రావు, దక్కుమళ్ల అంకాలు, సునీల్ తదితరులున్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నరసరావుపేట నియోజకవర్గ అభివృద్ధి దాత డాక్టర్ కోడెల




పల్నాడు జిల్లా. నరసరావుపేట. మే 2. (ప్రజాపాలన ప్రతినిధి.): నరసరావుపేట నియోజకవర్గ అభివృద్ధి దాత డాక్టర్ కోడెల శివప్రసాదరావుని నరసరావుపేట తెలుగుదేశం పార్టీ నాయకులు కొనియాడారు.డాక్టర్ కోడెల శివప్రసాదరావు 75 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన టిడిపి నాయకులు. మంగళవారం పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు 75 వ జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అథితులుగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు, టిడిపి రాష్ట్ర డాక్టర్ సెల్ ఉపాధ్యక్షులు కడియాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు సేవ చేసేందుకు డాక్టర్ వృత్తిని వదిలి నందమూరి తారక రామారావు పిలుపు మేరకు రాజకీయ రంగంలోకి ప్రవేశించి రాజకీయలలో రాణించారని తెలిపారు. ఏ రంగంలో పని చేసిన పేదలకు సేవ చేసే లక్ష్యంతోనే పని చేశారని అన్నారు. నిస్వార్థ ప్రజా సేవతో ఎంతో మంది ప్రజలకు సేవలు అందించిన గొప్ప నాయకులని, వైద్యునిగా, రాజకీయ నాయకుడిగా వారు ఎనలేని సేవలను అందించారన్నారు. పల్నాడు ప్రాంతం నుంచి రాష్ట్రా స్థాయి కి ఎదిగిన నేత కోడెల గారని, ఆయన పల్నాడు ప్రాంత ప్రజలలో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గొట్టిపాటి జనార్దన్ బాబు, పంగులూరి ఆంజనేయులు, మన్నాన్ షరీఫ్, పొనుగోటి శ్రీను, రఫీ, కొట్టా కిరణ్, రాపర్ల జగ్గారావు, బొడ్డపాటి పేరయ్య, చంద్ర ఆంజనేయులు, కోసూరి రాధికా, కుమ్మెత కోటిరెడ్డి, షేక్ అలీ భాష, మాజేటి వెంకటేష్, చెన్నుపాటి నాగేశ్వరరావు, తిరుములకొండ నరసింహారావు, మాబు, వనమా శివ, ఏ.వి.ఆర్ తదితర నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## ఫ్యామిలీ డాక్టర్ విధానము గురించి వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా వైద్యాధికారి



బాపట్ల జిల్లా ప్రజా పాలన మే 2: డాక్టర్ విజయమ్మ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి ఆధ్వర్యంలో క్రొత్తగా ఏర్పడిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, వైద్యాధికారులు మరియు సిబ్బంది ని ఫ్యామిలీ డాక్టర్ విధానము నకు మ్యాపింగ్ చేయడంలో భాగంగా సమావేశము ఏర్పాటు చేసినారు. ఈ సమావేశంలో డాక్టర్ విజయమ్మ మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానము ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిందని గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య సేవలు ఇంటి వద్దనే అందించడంలో భాగంగా డాక్టర్లు మరియు సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేసినారు. ఈ సమావేశంలో డాక్టర్ వైయస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని కూడా సమీక్షించడం జరిగింది, ఈ కార్యక్రమంలో డాక్టర్ టి. వెంకటేశ్వర్లు, వ్యాధి నిరోధక టీకాల అధికారి, ఇతర ప్రోగ్రాం ఆఫీసర్లు,వైద్యాధికారులు,ఆరోగ్య పర్యవేక్షకులు, ఆప్తాలమిక్ ఆఫీసర్లు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

## వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ఉత్తమ జర్నలిస్టు అవార్డు అందుకున్న సీనియర్ జర్నలిస్టు బండి శివ





పల్నాడు జిల్లా .నరసరావుపేట .మే 2 (ప్రజాపాలన ప్రతినిధి.) నరసరావుపేటకు చెందిన బండి శివ మీడియా మిత్ర: గుంటూరు: తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ జర్నలిస్టులకు ఉగాది పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం ను పరిష్కరించుకొని ఈరోజు గుంటూరులో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి భారత దేశ 13వ మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు, సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వివి లక్ష్మీనారాయణ ఆంధ్ర ప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు రామినేని ఫౌండేషన్ చైర్మన్ పాతూరు నాగభూషణం చేతుల మీదుగా మంగళవారం " లిఉత్తమ జర్నలిస్టు"గాలి అవార్డు అందుకున్న బండి శివ కు శుభాకాంక్షలు తెలిపిన పల్నాడు జిల్లా జర్నలిస్ట్ లు.

## నరసరావుపేటలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు 75 వ జయంతి వేడుకలు



పల్నాడు జిల్లా. నరసరావుపేట. మే 2 (ప్రజాపాలన ప్రతినిధి.) నరసరావుపేట పట్టణంలో స్థానిక జమిందార్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన డాక్టర్ కోడెల శివప్రసాదరావు 75 వ జయంతి వేడుకలలో భాగంగా నందమూరి తారకరామారావు,డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ......డాక్టర్ కోడెల శివప్రసాదరావు మంచి మనసున్న డాక్టర్ అని ఎంతో మంది పేదలకు అతి తక్కువ ఖర్చుకు వైద్య సేవలు అందించారన్నారు.పేద,బడుగు,బలహీన వర్గాలకు సేవ చేసేందుకు డాక్టర్ వృత్తిని వదిలి నందమూరి తారక రామారావు పిలుపు మేరకు రాజకీయ రంగంలోకి ప్రవేశించి రాజకీయలలో రాణించారని తెలిపారు.ఏ రంగంలో పని చేసిన పేదలకు సేవ చేసే లక్ష్యంతోనే పని చేశారని కొనియాడారు.తనకు కేటాయించిన మంత్రిత్వ శాఖలలో నూతన సంస్కరణ తీసుకువచ్చి నిర్వహించిన మంత్రి పదవులకు వన్నె తెచ్చారన్నారు.డాక్టర్ కోడెల బాటలోనే నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా??చదలవాడ అరవింద బాబు పయనిస్తున్నారని అరవింద బాబును ప్రజలందరూ ఆశీర్వదించాలని డాక్టర్లు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర డాక్టర్ సెల్ ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు,రాష్ట్ర డాక్టర్ సెల్ కార్యదర్శి నాగోతు ప్రకాష్,డాక్టర్ ఎనిగండ్ల మధుసూదన్ రావు,డాక్టర్ పువ్వాడ సూర్యనారాయణ రావు,డాక్టర్ రాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన వ్యక్తి కోడెల శివప్రసాదరావు: మాచర్ల టిడిపి ఇన్చార్జ్ జూలకంటి బ్రహ్మానంద రెడ్డి



కారంపూడి... మే02...ప్రజాపాలన... ప్రతినిధి: పట్టణంలోని మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం డాక్టర్ కోడెల శివప్రసాదరావు 75 వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి మండల పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన కోడెల శివప్రసాద్ జయంతి వేడుకల్లో ముఖ్యఅతిథిగా మాచర్ల నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ జూలకంటి బ్రహ్మానంద రెడ్డి పాల్గొని ముందుగా కేక్ కట్ చేశారు వారు మాట్లాడుతూ డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించి ప్రజా సేవ చేస్తూ ప్రజల మనసులు పొందిన వ్యక్తి అని రాజకీయం ద్వారా సమాజంలో సేవ చేసి అభివృద్ధి పదంలో ముందుకు పోయిన వ్యక్తి వరుస విజయాలతో అనేక సంక్షేమ పథకాలు చేపట్టి ప్రజలు మనసులను ఆకట్టుకున్నారు విడిపోయిన ఆంధ్ర రాష్ట్రంలో తొలి స్పీకర్ గా పనిచేసే ఆ పదవికి వెన్ను తెచ్చిన వ్యక్తి కోడెల శివప్రసాద్ రావు అని చంద్రబాబు కు తెలుగుదేశం పార్టీకి అండగా ఉంటూ పార్టీని ముందుకు నడిపిన వ్యక్తి అనీ వారు అన్నారు ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చదలవాడ కృష్ణమూర్తి జన్మదిన వేడుకలు



ప్రజాపాలన న్యూస్. శ్రీకాళహస్తి 1.5.23వ తేదీన తిరుపతి మాజీ ఎమ్మెల్యే మరియు తిరుపతి తిరుమల దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ శ్రీ చదలవాడ కృష్ణమూర్తి పుట్టినరోజు సంధర్భంగా కృష్ణ తేజ కాలేజ్ నందు అంబెద్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంబేడ్కర్ స్టార్ కృష్ణ ఆధ్వర్యంలో శ్రీ చదలవాడ కృష్ణమూర్తి గారికి శాలువా తో సత్కరించి బుద్ధ భగవానుని చిత్ర పటాన్ని బహూకరించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సదర్భంగా స్టార్ కృష్ణ మాట్లాడుతూ బోలా శంకరుడు, యధార్థ వాది, చదలవాడ కృష్ణమూర్తి గారు నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాల తో జీవించాలని భగవంతుని ప్రార్థించి నట్లు స్టార్ కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాజశేఖర్, నాగరాజ్, గురుమూర్తి, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం నిత్యాన్నదానానికి పది లక్షలనూట పదహారు రూపాయలు విరాళం అందజేసిన బోకం అష్టలక్ష్మీ



ప్రజాపాలన న్యూస్ శ్రీకాళహస్తి :శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం నిత్యాన్నదాన పథకమునికి అనకాపల్లి వాస్తవ్యులు బోకం అష్టలక్ష్మి గారు మరియు మిత్ర బృందం ఔనాష్,ఆనంద్,గణేష్ కలిసి ( పది లక్షల నూట పదహారు రూపాయలు) 10,00,116/- శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు కి అందజేశారు వారికి ఆలయ ఛైర్మన్ ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేయించి స్వామి-అమ్మవార్ల శేష వస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్ ఆలయ అధికారులు దేవస్థానం అకౌంటెంట్ ప్రశాంత్, దేవస్థాన సిబ్బంది కామేష్ విరాళం కౌంటర్ వేణు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న: ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు



కంచికచర్ల మే2 ప్రజాపాలన ప్రతినిధి. అన్ని దానాల్లో అన్నదానం మిన్న అని శాసనసభ్యులు డాక్టర్ జగన్ మోహన్ రావు అన్నారు మండల పరిధిలోని కీసర జాతీయ రహదారి పక్కన గల శ్రీ భువనేశ్వరి పీఠపాలిత శ్రీ అమ్మ లలిత లోకేశ్వరి శివ శంకర శివాలయం 9వ వార్షికోత్సవంపురస్కరించుకొనిమంగళవారం ఆల యం ప్రాంగణంలో స్వామివారికి విశేష పూజా కార్యక్ర మంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అ తిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే జగన్ మోహన్ రావుకి స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి ఆలయ అర్చ కులు రాము శర్మ వేదాశ్వీరచనాలు అందజేశారు త దనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా అన్నదాన కా ర్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో పరిటాల రామకోటేశ్వరరావు రాము వేల్పుల. రమేష్, యర్రగొ ర్ల. రామకృష్ణ, చలమాల. ప్రభాకర్, రామిశెట్టి. నరసిం హారావు, (కేబుల్) శ్రీనివాసరావు, గ్రామ నాయకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు

## డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలతో సమావేశం ని ర్వహించిన ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు



కంచికచర్ల వేం 2 ప్రజాపాలన ప్రతినిధి మండలంలోని పెండ్యాల గ్రామంలో డ్వాక్రా పొదుపు సంఘాల మహి ళలు, నియోజకవర్గంలోని నాలుగు మండలాల డ్వా క్రా ఏపీఎంలు, సీసీలు, ఇతర అధికారులతో శాసన సభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై యస్ జగన్ మోహన్ రెడ్డి పొదుపు సంఘాలను బలో పేతం చేస్తూ లాభాల బాటలో పయనించే విధంగా చ ర్యలు చేపడుతూ డ్వాక్రా మహిళల జీవితాల్లో వెలు గులు నింపేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్ర భుత్వ ఆశయాలకు, ఆలోచనలకు అనుగుణంగా అ ధికారులు కూడా బాధ్యతాయుతంగా పనిచేయాలని, పొదుపు సంఘాల మహిళలకు జవాబుదారీగా అధి కారులు ఉంటూ, మహిళల బ్యాంకు ఖాతాల రుణాల చెల్లింపులు తదితర విషయాలపై వారికి పూర్తి సమా చారం అందజేయాలని ఆదేశించారు. అదేవిధంగా పొ దుపు సంఘాల మహిళల నుంచి బుక్ కీపర్ లు, సీసీ లు, ఏపీఎంలు ఏమైనా లంచాలు డిమాండ్ చేశారని తన దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మలక్ బషీర్, వేల్పు ల రమేష్, వీరులపాడు జడ్పీటిసి అమర్లపూడి కీర్తి సౌ జన్య, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కం చర్ల పద్మ, నాలుగు మండలాల ఏపీఎంలు భాస్కర్, సుబ్రహ్మణ్యం, వెంకటరమణ, సుధారాణి తదితరులు పాల్గొన్నారు

## 2024లో సత్తెనపల్లి నియోజకవర్గంలో జనసేన పార్టీ జెండాను ఎగరవేస్తాం: బోనబోయిన



రాజుపాలెం ప్రజాపాలన :జండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్ గారిని, జిల్లా అధ్యక్షుడు శ్రీ గాదె వెంకటేశ్వరరావు గారిని అనుపాలెం గ్రామం నుంచి అంచులూరిపాలెం గ్రామం వరకు బైక్ ర్యాలీతో వీర మహిళల హారతులతో పూల వర్షంతో అంగరంగ ఆహ్వానించడం జరిగింది....ముందుగా గ్రామంలోని శ్రీ అమరలింగేశ్వర స్వామి వారికి పూజలు నిర్వహించి అనంతరం గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరిని పలకరించుకుంటూ ముఖ్య అతిథులు శ్రీనివాస్ యాదవ్ గారు జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్ గారి చేతుల మీదుగా జెండాను ఆవిష్కరించడం జరిగింది..అనంతరం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వరరావు గారు మాట్లాడుతూ గతంలో ప్రజారాజ్యం పార్టీ ఉన్నప్పుడు ఇదే అంచుల వారి పాలెం గ్రామంలో 95% ఓట్లు పోలయ్యాయి , రానున్న ఎన్నికల్లో 100% ఓట్లు జనసేన పార్టీకి పడేలాగా ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు... మేము గ్రామానికి వస్తుంటే మాలో పవన్ కళ్యాణ్ గారిని చూసుకొని మాకు పూలవర్షం కురిపిస్తూ హారతులతో స్వాగతం పలుకు పలికిన గ్రామంలో ఉన్న ప్రతి మహిళకు కృతజ్ఞతలు తెలియజేశారు..రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్ గారు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రం ఉన్న పరిస్థితుల్లో జనసేన పార్టీ ఉంటేనే రాష్ట్ర భవిష్యత్తు ఉంటుంది అని.. పేద బడుగు బలహీన వర్గాలకు అందరికీ న్యాయం చేయాలంటే పవన్ కళ్యాణ్ గారి ముఖ్యమంత్రిగా వస్తేనే న్యాయం జరుగుతుందని.. 2009లో అంచులవారి పాలెం గ్రామంలో ప్రజారాజ్యం పార్టీకి ఎలా అయితే అండగా ఉన్నారో రానున్న 2024 ఎలక్షన్ లో కూడా జనసేన పార్టీ అంతే అండగా ఉండాలని మిమ్మల్ని ఆదర్శంగా తీసుకొని మిగిలిన గ్రామాలు కూడా జనసేన పార్టీకి బలంగా నిలబడాలని కోరుకుంటున్నాను. మేము గ్రామంలోకి వస్తుంటే మమ్మల్ని ఎంత అపురూపంగా గ్రామంలోకి తీసుకొని వచ్చిన గ్రామంలో ఉన్న ప్రతి ఒక్క పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేకంగా వీర మహిళలందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను...ఈ జెండా ఆవిష్కరణ జరుగుటకు కృషిచేసిన తోట నాగేశ్వరరావు, గలబా నాగేశ్వరరావు, జనసేన సుబ్బారావు, అంచుల వాసు, అంచుల అనీష్, తోట శివరాం, అంచుల వెంకీ గ్రామంలో ఉన్న జనసేన పార్టీ కార్యకర్తలు అందరిని అభినందించడం జరిగింది...ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అడపా మాణిక్యాలరావు, జిల్లా కార్యదర్శి ఎర్రంశెట్టి రామకృష్ణ, జిల్లా సంయుక్త కార్యదర్శిలు సిరిగిరి శ్రీనివాసరావు, కాసిం సైదా, దమ్మాలపాడు ఎంపీటీసీ సిరిగిరి రామారావు, వల్లెం శ్రీనివాసరావు, సిరిగిరి మణికంఠ, గ్రామ అధ్యక్షులు వెంకటకృష్ణ, రుద్ర జడ శివయ్య, తిరుమల శెట్టి గోపి, నకరికల్లు ఉపాధ్యక్షులు నాగూర్ వలి,రాజుపాలెం మండల ప్రధాన కార్యదర్శి కేదార రమేష్ ,సత్తెనపల్లి రూరల్ మండలం ప్రధాన కార్యదర్శి అంచుల రామాంజనేయులు, మధులాల్, గ్రంధి సదాశివరావు, బాదినీడు సుబ్బారావు, సైదారావు మరియు అధిక సంఖ్యలో జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహానాడును భగ్నం చేయడానికే ఆదిరెడ్డి అరెస్టు



భీమవరం, మే 2 (ప్రజాపాలన ప్రతినిధి) : స్థానిక తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో మంగళవారం తెదేపా పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పార్టీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ ప్రజలలో తెదేపాకు వస్తున్న ఆదరణ చూసి వైసీపీకి వెన్నులో వణుకుపుట్టి మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు 1966 సంవత్సరంలో స్థాపించిన జగజ్జనని చిట్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ గురించి ఖాతాదారులు ఫిర్యాదు చేయకుండానే అధికారిచే ఫిర్యాదు చేయించి ఆదిరెడ్డి అప్పారావు, కుమారుడు వాసులను అర్ధరాత్రి జైలుకు పంపడం మహానాడుని భగ్నం చేసేందుకేనని విమర్శించారు. డ్వాక్రా అంగన్వాడి సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ మాట్లాడుతూ జగన్ బీసీల ద్రోహి అనేది బీసీ నాయకుల అరెస్టుల ద్వారా అర్థమవుతుందని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆదిరెడ్డి అప్పారావు వాసులు నిత్యం ప్రజల మధ్యలో ఉండి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తూ ప్రజల ఆదరణ పొందుతున్నందున తప్పుడు కేసులు బనాయించి అరెస్టు చేయడాన్ని ఖండించారు. రాష్ట్ర కార్యదర్శి వెంద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ చిట్ ఫండ్ కంపెనీలలోఎటువంటి అవినీతి మోసం జరగలేదని ఖాతాదారులు ఫిర్యాదు ఇవ్వకపోయినా జగన్ ఏపీ సిఐడి పోలీసులచే ఆదిరెడ్డి చిట్ కంపెనీల మీద విచారణతో అరెస్టు చేయటాన్ని న్యాయపరంగా ఎదుర్కొంటామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి ప్రసాద్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు పడమటి సోమేశ్వరరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి గూడూరి సుబ్బారావు, యువత మాజీ అధ్యక్షుడు మద్దుల రాము, ఐటీడీపీ నియోజకవర్గ కన్వీనర్ మరపట్ల శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## బైపాస్ రోడ్డుకు కలెక్టరేట్ మార్గ్ పేరుకు కృషి: ఎమ్మెల్యే గ్రంధి



భీమవరం, మే 2 (ప్రజాపాలన ప్రతినిధి) : స్థానిక బైపాస్ రోడ్డుకు కలెక్టరేట్ మార్గ్ గా నామకరణం చేయడానికి కృషి చేస్తానని శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ అన్నారు. రానున్న రోజుల్లో మార్కెట్ యార్డులో కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు ఏర్పాటుకానున్న నేపథ్యంలో ఈ బైపాస్ రోడ్డు ప్రజలకు చాలా కీలకంగా మారుతుందని ఆయన తెలిపారు. రూ.3 కోట్ల 65 లక్షల నిధులతో జడ్డు బ్రహ్మాజీ కళ్యాణమండపం వద్దనుండి బి.వి.రాజు బొమ్మ వరకు నిర్మాణం చేసిన సీసీ, బీటీ బైపాస్ రోడ్డును శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం సిఎస్ఆర్ నిధుల క్రింద లైన్స్ క్లబ్ తో కలసి రూ. 20 లక్షలతో ఏర్పాటు కానున్న బైపాస్ రోడ్లో క్లాక్ టవర్, పోలీస్ అవుట్ పోస్ట్, కంట్రోల్ ఫ్లడ్ లైటింగ్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ భీమవరం జిల్లాకేంద్రం అయిన నేపథ్యంలో పట్టణంలో పూర్తిస్థాయిలో సుందరీకరణ చేస్తున్నామని అన్నారు. ముఖ్యంగా కలెక్టరేట్ త్వరలో మార్కెట్ యార్డ్ లో ఏర్పాటు కానున్న నేపథ్యంలో బైపాస్ రోడ్డును మూడు కోట్ల 65 లక్షల నిధులతో సిసి, బీటీ రోడ్డుగా ఆధునీకరించడం జరిగిందని అన్నారు. భీమవరం జిల్లా కేంద్రం కావడంతో స్వచ్ఛంద సంస్థలు, లైన్స్ క్లబ్ ముందుకు వచ్చి అభివృద్ధికి సహకరించడం అభినందనీయమని నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలు వంకా రవీంద్రనాథ్, కౌరు శ్రీనివాస్ సహకారంతో పట్టణాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఎమ్మెల్సీగా ప్రమాణం చేసే రోజునే జిల్లా కేంద్రమైన భీమవరంలో డైనమిక్ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తో కలిసి అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనడం తనకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. భీమవరం విద్య, వైద్య ,వాణిజ్య రంగాలలో రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని భీమవరం జిల్లా కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేయడానికి తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్ శివరామకృష్ణ, ఎంఈ త్రినాధరావు, డిఈ తోట నారాయణరావు, ఆర్ అండ్ బి డిఈ రామరాజు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరి గోగురాజు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి ఏఎస్ రాజు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, జాతీయ బిసి సంఘ జిల్లా అధ్యక్షులు కోడె యుగంధర్, వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమబాల, పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, మానేపల్లి నాగన్న బాబు,తోట ఫణి, అల్లూరి భాస్కరరాజు, పట్టా వెంకట నరసింహారావు, గాదిరాజు సుబ్రమణ్యం రాజు, నల్లం రాంబాబు, కోమటి రాంబాబు, గంటా సుందర్ కుమార్, పాలపర్తి జోనా, షేక్ ఇమామ్, మల్లుల శ్రీనివాసరావు బొక్కా గోపి తదితరులు పాల్గొన్నారు.

## అన్నా క్యాంటీన్ కు పది బస్తాల బియ్యం 50 కేజీల కందిపప్పు వితరణ



జగ్గయ్యపేట మే 2 ప్రజా పాలన ప్రతినిధి: మండలప రిధిలో బుదవాడ గ్రామానికి చెందిన గుగులోతు రమే ష్ అన్న క్యాంటీన్ కు 10 బస్తాల బియ్యం, 50 కేజీల కందిపప్పు, 4 బస్తాల ఉల్లిపాయలు మరియు ఇతర సామాగ్రిని వితరణగా తెలుగుదేశం పార్టీ జాతీయ కో శాధికారి శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ,శ్రీరాం చినబా బు ద్వారా అన్న కాంటీన్ కు అందజేశారు. ఈ సంద ర్భంగా రమేష్ మాట్లాడుతూ పేదల ఆకలి తీరుస్తు న్న అన్నా క్యాంటీన్ కు తన వంతు సహాయ సహకా రాలు అందించడం చాలా సంతోషంగా ఉందని తెలి పారు. ఈ కార్యక్రమంలో గేల్లా .వైకుంఠేశ్వరరావు, షేక్. మాబుమియ,ఓర్సునరసింహారావు, తాళ్లూరి. శివా, గునిసెట్టి.శ్రీను, పిట్ల.శ్రీకాంత్,నరసింహ తదితరులు పా ల్గొన్నారు.

## ఏఎస్పీ,డీఎస్పీ లను కలిసిన బిసీ సంక్షేమ సంఘం, దిశ ఫౌండేషన్ స్టేట్ మహిళ బృందం



రాజమహేంద్రవరం: ప్రజాపాలన ప్రతినిధి: బి సి సంక్షేమ సంఘం స్టేట్ టీమ్ ,దిశ ఫౌండేషన్ స్టేట్ బృందం మంగళవారం ఉదయం తూర్పుగోదావరి జిల్లా సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయం లో అడిషనల్ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ రజినీ, దిశ డి.ఎస్.పి తిరుమలరావు ,ట్రాఫిక్ సి.ఐ రమణమ్మ ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా,పుష్పగుచ్ఛం సమర్పించి సన్మానించారు. కలిసిన వారిలో కే.స్వాతి వర్మ,సుశీల మార్గాని,పిల్లి రమ్య,నాగిని, దేవిక రాణి, తులసి, ఎం. కనక మహాలక్ష్మి ఉన్నారు. ఈ సందర్భంగా సుశీల మార్గాని మాట్లాడుతూ మహిళలు సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని ఆర్థిక స్వావలంబన సాధించాలని,రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన మహిళ రిజర్వేషన్ ఉపయోగించుకుని మహిళలు సాధికారత దిశగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

## సంక్షేమ వసతి గృహాలను సందర్శించిన సివిల్ జడ్జ్ కె. ప్రత్యూష కుమారి



రాజమహేంద్రవరం: ప్రజాపాలన ప్రతినిధి: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ కె. ప్రత్యూష కుమారి పట్టణంలోని పలు సంక్షేమ వసతి గృహాలను సందర్శించారు. ముందుగా ప్రకాష్ నాగర్ లోని కె.వి. స్టేట్ హోం ను సందర్శించి అక్కడ వసతులని పరిశీలించారు. తరువాత బాల సదనమును సందర్శించి చిన్నారులతో మాట్లాడారు. వారికి అక్కడ అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉద్యోగినుల వసతి గృహమును సందర్శించి వసతులను పరిశీలించారు. అనంతరం బాలుర పర్యవేక్షణ గృహమును సందర్శించిన న్యాయమూర్తి అక్కడి వసతులను పరిశీలించి బాలురుతో కాసేపు మాట్లాడారు. శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి రావాలన్నారు. న్యాయ మార్గాన్ని అనుసరిస్తే జీవితంలో ప్రశాంతత, గౌరవం లభిస్తాయని లేదంటే జీవితం దుర్భలం అవుతుందని వివరించారు. వారికి ఎలాంటి న్యాయ సేవలు కావాలన్న జిల్లా న్యాయ సేవాధికర సంస్థకి తెలియజేయాలన్నారు.


## పంట దెబ్బతిన్నరైతులను తక్షణమే ఆదుకోవాలి



నరసాపురం, మే 2 (ప్రజాపాలన ప్రతినిధి) :ఇటీవల కురిసిన వర్షాలకు వరి పంట నీట మునిగి తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన నరసాపురం మండలం మల్లవరం, మల్లవరం లంక, కొప్పర్రు గ్రామాలలో పర్యటించి గత రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాల కారణంగా నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పొత్తూరి రామరాజు మాట్లాడుతూ దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి అధికారులచే పంట నష్టాలను అంచనా వేయించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తెదేపా మండల అధ్యక్షుడు వాతాడి ఉమామహేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు జక్కం శ్రీమన్నారాయణ, పార్టీ నాయకులు పెచ్చెట్టి యేసుబాబు, పెచ్చెట్టి వెంకన్న, కవురు యేసుబాబు, కవురు త్రిమూర్తులు, కవురు మురళి, మూల వీరాస్వామి, సంధి నరసింహరావు, ముక్కు బాబూరావు, పోతినీడి ముసలయ్య, విజయరాజు, షేక్ అలీషా పాల్గొన్నారు.

## 'ఆదిపురుష్' ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగేది అక్కడేనా ?

ప్రభాస్, కృతి సనన్ ల కలయికలో బాలీవుడ్ డైరెక్టర్ ఓం రౌత్ తెరకెక్కిస్తున్న లేటెస్ట్ మూవీ ఆదిపురుష్. ఈ భారీ మైథలాజికల్ మూవీని రెట్రో ఫైల్స్, టి సిరీస్ ఫిలింస్ సంస్థలు గ్రాండ్ గా నిర్మిస్తుండగా ఇందులో ప్రభాస్ రాఘవగా, కృతి సనన్ సీతగా కనిపించనున్నారు. రామాయణం ఆధారంగా రూపొందిన ఆదిపురుష్ మూవీ జూన్ 16న గ్రాండ్ గా పలు భాషల ఆడియన్స్ ముందుకి రానుంది. ప్రభాస్ ఫ్యాన్స్ తో పాటు నార్మల్ ఆడియన్స్ లో కూడా ఆదిపురుష్ పై భారీ స్థాయిలో అంచనాలు ఉన్నాయి.అయితే మే 9న ట్రైలర్ రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తోన్న ఆదిపురుష్ యూనిట్, ఈ మూవీ యొక్క ప్రీ రిలీజ్ ఈవెంట్ ని తిరుపతి లో నిర్వహించేందుకు ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై త్వరలో ప్రకటన కూడా రానుందట. అతి త్వరలో ప్రమోషనల్ కార్యక్రమాలని మొదలు పెట్టనుండగా పక్కాగా మూవీ అందరినీ ఆకట్టుకుంటుందని యూనిట్ అభిప్రాయపడుతోంది.




## అల్లు అర్జున్.. ఒకేసారి రెండు?



స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ కి తెలుగు రాష్ట్రాల్లో విపరీతమైన క్రేజ్ ఉంది. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ కుమారుడిగా హాస్య నటుడు పద్మశ్రీ అల్లు రామ లింగయ్య మనవడిగా సినీ రంగంలో అడుగు పెట్టినప్పటికీ.. ఈయనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నాడు. 1885లో వచ్చిన విజేత సినిమా ద్వారా బాల నటుడిగా తెలుగు సినీ ఇండస్ట్రీలో కాలు మోపిన ఆయన మరో 2003లో గంగోత్రి సినిమా ద్వారా హీరోగా పరిచయం అయ్యాడు.మొదటి సినిమాతోనే బ్లాక్ బస్టర్ హిట్టు కొట్టాడు. ఆ తర్వాత ఆర్య బన్ని హ్యాపీ దేశముదురు పరుగు ఆర్య-2 సినిమాల్లోనూ నటించి తన టాలెంట్ ను ప్రూవ్ చేసుకున్నాడు. జులాయి రేసుగుర్రం ఎవడు సన్నాఫ్ సత్యమూర్తి సరైనోడు అల వైకుంఠ పురంలో పుష్ప సినిమాలతో దేశ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు. తాజాగా పుష్ప-2 సినిమాలో నటిస్తూ మరింత బిజీగా గడుపుతున్నాడు.అయితే ఈ సినిమా తర్వాత అల్లు అర్జున్ ఎవరితో సినిమా చేస్తాడు ఎలాంటి సినిమాలో నటిస్తాడనే దానిపై ఆయన అభిమానులు తెగ ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. ఎప్పుడెప్పుడు ఆయన నెక్స్ట్ మూవీ గురించి అప్ డేట్ ఇస్తారా అని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలోనే నెట్టింట ఓ వార్త వైరల్ గా మారింది. స్టైలిష్ స్టార్ పుష్ప-2 షూటింగ్ పూర్తవగానే రెండు సినిమాల్లో నటిస్తాడని.. వాటి గురించి త్వరలోనే ప్రకటిస్తాడని తెలుస్తోంది.అయితే వీటిలో ఓ చిత్రం మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తో కలిసి చేస్తారట. ఇది మాత్రం ఫిక్స్ అయినట్లు సమాచారం. కానీ ఇందులో ఎవరు నటిస్తారు సినిమా ఎప్పుడు పట్టాలెక్కుతుంది వంటి విషయాలు తెలియాలంటే మాత్రం ఇంకా కొంత కాలం ఆగాల్సిందేనట. మరో సినిమా దర్శకుడు సురేందర్ రెడ్డిది అయినా ఏమీ ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదు. అయితే ఈ సినిమాకు సంబంధించి స్క్రిప్ట్ వర్కును ఈరోజే మొదలు పెట్టారు కూడా. అది ఎలా వస్తుంది అన్న దాన్ని బట్టి బన్నీ నిర్ణయం ఉంటుంది. సురేందర్ రెడ్డి రాస్తున్న కథ నచ్చితే కచ్చితంగా అల్లు అర్జున్ ఆయనతో సినిమా చేస్తారట. మరి చూడాలి స్క్రిప్ట్ ఎలా ఉంటుంది ఈ సినిమాకు బన్నీ ఓకే చెప్తాడా లేదా అనేది.

## మహేష్ కి కూడా బాలీవుడ్ హీరో కావాలట ?



టాలీవుడ్ స్టార్ హీరోల సినిమాల్లో విలన్లుగా బాలీవుడ్ నటులను తీసుకుంటున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఎన్టీఆర్ – ప్రభాస్ సినిమాల్లో విలన్ గా సైఫ్ అలీఖాన్ నటిస్తున్నాడు. అయితే, తాజాగా మహేష్ సినిమాకి కూడా ఇప్పుడు ఓ బాలీవుడ్ విలన్ కావాలట. మహేష్ బాబు తన తాజా చిత్రాన్ని త్రివిక్రమ్ దర్శకత్వంలో చేస్తున్నాడు. పాన్ ఇండియా ఇమేజ్ ను దృష్టిలో పెట్టుకుని, ఈ సినిమాను ప్లాన్ చేస్తున్నారు. అందుకే.. ఈ సినిమాలో నటించే విలన్ పాత్ర కోసం బాలీవుడ్ హీరో జాన్ అబ్రహం ను ఎంపిక చేసుకోవాలని త్రివిక్రమ్ ప్లాన్ చేస్తున్నారు. మరి జాన్ అబ్రహం ఈ సినిమా చేయడానికి అంగీకరిస్తాడో లేదో చూడాలి. ఇక ఈ సినిమాలో మహేష్ సరసన హీరోయిన్ గా పూజా హెగ్డే నటిస్తోంది. అలాగే ఈ సినిమాలో మరో హీరోయిన్ శ్రీలీల కూడా నటిస్తోంది. మహేష్ – త్రివిక్రమ్ కలయికలో ఈ సినిమా వస్తుండే సరికి, ఈ సినిమా పై భారీ అంచనాలు ఉన్నాయి. పైగా ఈ సినిమాను తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ఒకేసారి రిలీజ్ చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. హారిక హాసిని క్రియేషన్స్ భారీ ఎత్తున ఈ సినిమాని ఈ సినిమాని నిర్మిస్తోంది.


## ఎన్టీఆర్ 30.. ఆమె అవసరం ఉందా..?







ఆర్ఆర్ఆర్ తర్వాత ఎన్టీఆర్ కొరటాల శివ తో సినిమా ఫిక్స్ చేసుకున్నాడు. ఎన్టీఆర్ ఆర్ట్స్ యువ సుధ ఆర్ట్స్ కలిసి నిర్మిస్తున్న ఈ సినిమాను పాన్ ఇండియా రేంజ్ లో భారీ బడ్జెట్ తో ప్లాన్ చేశారు. సినిమాలో బాలీవుడ్ భామ జాన్వి కపూర్ హీరోయిన్ గా నటించింది. అనిరుద్ రవిచంద్రన్ మ్యూజిక్ కంపోజర్ గా ఫిక్స్ అయ్యారు. సినిమాలో జాన్వి ఉన్నా సరే కథ ప్రకారం మరో హీరోయిన్ అవసరం ఉంటుందని టాక్. అందుకే ఆ పాత్రలో సాయి పల్లవి ని సెలెక్ట్ చేశారని తెలుస్తుంది.మలయాళ సినిమా ప్రేమంతో సౌత్ ఆడియన్స్ ను అలరించిన సాయి పల్లవి తన సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు ఫేవరెట్ గా మారింది. ఇప్పటివరకు స్టార్ హీరోల సినిమాల్లో కాకుండా టైర్ 2 హీరోలతోనే నటిస్తూ సక్సెస్ ఫుల్ కెరీర్ కొనసాగిస్తుంది అమ్మడు. ఇక ఇప్పుడు ఎన్టీఆర్ లాంటి స్టార్ హీరో సినిమాలో ఛాన్స్ అందుకుందని తెలుస్తుంది. సాయి పల్లవి సినిమాలో ఉంది అంటే ఆ సినిమాకు ప్రత్యేకమైన క్రేజ్ ఏర్పడుతుంది. ముఖ్యంగా సాంగ్స్ విషయంలో చాలా క్రేజ్ వస్తుంది. అమ్మడు డాన్స్ చేసే ఒక్క సాంగ్ అయినా కూడా ట్రెండింగ్ లోకి వస్తుంది.ఎన్టీఆర్ కూడా మంచి డాన్సర్ ఇప్పుడు అతని సినిమాలో సాయి పల్లవి నటిస్తుంది అంటే ఇద్దరు కలిసి ఒక డ్యాన్స్ నెంబర్ వేస్తే మాత్రం ఓ రేంజ్ లో ఉంటుందని చెప్పొచ్చు. కొరటాల శివతో ఆల్రెడీ జనతా గ్యారేజ్ సినిమా చేసిన తారక్ మరోసారి ఈ కాంబోలో ఈసారి పెద్ద టార్గెట్ తో వస్తున్నాడు. అసలైతే ఆచార్య ఫ్లాప్ కి పూర్తి బాధ్యత కొరటాల శివదే అంటూ అతని మీద బాగా నెగిటివిటీ వచ్చేసింది. అయినా సరే తారక్ కొరటాల శివ మీద నమ్మకం ఉంచి సినిమా చేస్తున్నాడు.ట్రిపుల్ ఆర్ తర్వాత చరణ్ గేమ్ ఛేంజర్ గా శంకర్ సినిమాతో వస్తుంటే కొరటాల శివతో తారక్ ప్రయోగం చేస్తున్నాడు. 2024 ఏప్రిల్ లో ఎన్టీఆర్ 30వ సినిమా రిలీజ్ ఫిక్స్ చేశారు. ఈ ఏడాది చివరి కల్లా సినిమా ప్రొడక్షన్ పూర్తి చేసి నెక్స్ట్ ఇయర్ 3 నెలలు పోస్ట్ ప్రొడక్షన్ వి.ఎఫ్.ఎక్స్ వర్క్ చేయించాలని కొరటాల శివ ప్లాన్.

## నిఖిల్ 'స్పై'.. తస్మాత్ జాగ్రత్త!




యంగ్ హీరో నిఖిల్ కార్తికేయ 2 చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. 18 పేజెస్ చిత్రం కూడా నిఖిల్ కి డీసెంట్ సక్సెస్ ని తెచ్చి పెట్టింది. హీరోగా నిఖిల్ బ్యాక్ టు బ్యాక్ విజయాలని దక్కించుకోవడంతో తదుపరి సినిమా విషయమై ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం నిఖిల్ స్పై చిత్రంలో నటిస్తున్న విషయం తెల్సిందే.గ్యారీ దర్శకత్వంలో రూపొందుతున్న స్పై చిత్రాన్ని నిఖిల్ మార్కెట్ కి మించి ఎక్కువ బడ్జెట్ తో నిర్మిస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ఇప్పటి వరకు సినిమాకు సంబంధించిన రిలీజ్ అప్డేట్ కానీ.. ఇతర అప్డేట్స్ కానీ ఏమీ రాలేదు. కానీ కచ్చితంగా నిఖిల్ కెరీర్ లో బిగ్ చిత్రంగా స్పై నిలుస్తుందని ఇండస్ట్రీ వర్గాల్లో మరియు మీడియా సర్కిల్స్ లో ప్రచారం జరుగుతోంది.స్పై చిత్రం కాస్త అటు ఇటుగా అఖిల్ అక్కినేని హీరోగా నటించిన ఏజెంట్ సినిమా తరహాలో ఉండే అవకాశాలు ఉన్నాయి అంటున్నారు. అదే నిజమైతే ఏజెంట్ ఫలితం నేపథ్యంలో నిఖిల్ స్పై టీమ్ కాస్త జాగ్రత్తగా ఉండటం బెటర్. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి దూరంగా ఇలాంటి కాన్సెప్ట్ లపై భారీగా ఖర్చు చేస్తే చేతులు కాల్చుకున్నట్లు అవుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఏజెంట్ సినిమాకు భారీగా ఖర్చు చేస్తే అందులో సగం వెనక్కు వచ్చే పరిస్థితి లేదు అంటూ ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో స్పై మేకర్స్ బడ్జెట్ విషయంలో శృతి మించుకుంటే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. నిఖిల్ యొక్క మార్కెట్ ను దృష్టిలో పెట్టుకుని స్పై కి ఖర్చు పెట్టాలని... ఫలితం కాస్త అటు ఇటు అయినా కూడా మొత్తం సీన్ రివర్స్ అవుతుందని హెచ్చరిస్తున్నారు.

## వీరమల్లు' కొత్త షెడ్యూల్ కి రెడీ




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ – క్రియేటివ్ డైరెక్టర్ క్రిష్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న భారీ సినిమా 'హరిహర వీరమల్లు'. అయితే, ఈ సినిమా టీమ్ తదుపరి షెడ్యూల్ కోసం సన్నద్ధం అయ్యింది. క్లైమాక్స్ కి ముందు వచ్చే ఓ యాక్షన్ సీక్వెన్స్ ను షూట్ చేయడానికి దర్శకుడు క్రిష్ రెడీ అయ్యాడు. ఈ నెల మూడో వారం నుంచి ఈ యాక్షన్ సీక్వెన్స్ ను సారధి స్టూడియోలో షూట్ చేయనున్నారు. కాగా మొఘల్ కాలం నాటి ఫిక్షన్ కథతో ఈ సినిమా తెరకెక్కుతోంది.ఇక ఈ సినిమాలో జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ఓ కీలక పాత్రలో నటిస్తోంది. అలాగే ఈ మూవీలో హీరోయిన్ గా నిధి అగర్వాల్ నటిస్తోంది. ఈ సినిమాని పాన్ ఇండియా సినిమాగా తీసుకురానున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్ పై ప్రముఖ నిర్మాత ఏ ఎం రత్నం ఈ సినిమాని భారీగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా కోసం పవన్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరీ ఈ సినిమా ఎలా ఉండబోతుందో చూడాలి.




Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com